అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 12 పరాభవ - శ్రావణ శుద్ధ విదియ, 14 ఆగస్టు 2026

శతావధానులు పింగళి కాటూరి కవులు

శా. దంతుల్ ఘోటకముల్ పదాతులును చెంతం గొల్చిరాన్ వచ్చు దు
ష్యంతు న్గన్గొని కణ్వమౌని యిటు రాజా రమ్మనన్ మీకు మీ
అంతేవాసులకున్ సుఖమ్మె యన నీ యండ న్సుఖంబుండె మా
కాంతారమ్మనియెన్ మునీంద్రుడు చమత్కారంబు దీపింపగన్

కాటూరి వేంకటేశ్వర రావు
(1895 -1962)

పింగళి లక్ష్మీకాంతం
(1894 - 1972)

ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్

అక్షరకౌముది సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో జరిగిన నల్లాన్ చక్రవర్తుల సాహిత్ స్వర్ణావధానం సందర్భంగా 'అవధానపుష్కరిణి' జులై సంచిక ఆవిష్కరణ

అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 12

పరాభవ - శ్రావణం 2026 14-08-2026 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్ R.No.691/2026

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని

సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు
మరుమాముల దత్తాత్రేయశర్మ

సహసంపాదకులు
కె.వి.ఎన్. ఆచార్య
కుంతి

గౌరవ సలహాదారులు
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

సంపాదకవర్గం
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
డా॥ మారేపల్లి వేంకట పట్వర్ధన్
డా॥ ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

రూపకల్పన: పంతుల విట్టుబాబు
అక్షరాలంకరణ: విరివెంటి సాహితీసుధ

కార్యాలయం
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

అవధానవిద్యా విజయతే తరామ్

సంపాదకీయం

అవధాన సందేశం

మానవ మేధ ఎన్నో అద్భుతాలను సృష్టించింది. విజ్ఞాన శాస్త్రం విశ్వాంతరాళాలను జయించింది. కృత్రిమ మేధ (Artificial Intelligence) సైతం మానవుని దైనందిన జీవితంలో భాగమైంది. సమాచార ప్రవాహం అపారంగా పెరిగింది. కానీ ఇదే సమయంలో మనిషి ఏకాగ్రత తగ్గుతోంది. జ్ఞాపకశక్తి బలహీనపడుతోంది. పుస్తక పఠనం పూర్తిగా మరుగునపడిపోతుంది. భాషా పరంగా ఆలోచనా నిశితత్వం క్షీణిస్తోంది. సంభాషణా సంస్కృతి స్థానంలో సంక్షిప్త సందేశాల సంస్కృతి పెరుగుతోంది.

ఇలాంటి కాలంలో అవధానం ఒక సాహిత్య కళగా మాత్రమే కాకుండా; సమాజానికి మార్గదర్శనం చేసే జీవనదర్శనంగా నిలుస్తుంది. ఏకాగ్రతా సాధనకు అవధానం ఒక ప్రత్యామ్నాయం.

"మనస్సును జయించినవాడే ప్రపంచాన్ని జయించగలడు." అనే సందేశాన్ని అవధానం ఇస్తుంది. అవధాని అనేక ప్రశ్నలను వింటాడు; కానీ అతని మనస్సు చెల్లాచెదరవదు. అవధానంలో జీవిత విజయాలకు మూలమైన ధారణ ప్రధాన మైనది. ఒకసారి విన్న విషయాన్ని క్రమబద్ధంగా నిలుపుకోవడం, సరైన సమయంలో గుర్తుకు తెచ్చుకోవడం, తర్కబద్ధంగా వినియోగించడం – ఇది కేవలం అవధానికి మాత్రమే కాదు, ప్రతి విద్యార్థికి, ప్రతి పరిశోధకునికి, ప్రతి ఉద్యోగికి, ప్రతి వ్యక్తికీ అవసరమైన నైపుణ్యం.

ఈ నేపథ్యంలో అవధానం చెప్పే సందేశం స్పష్టమైనది. "జ్ఞానం సంపాదించడం కంటే దానిని నిలుపుకోవడం గొప్పది." ఏఐ పరిజ్ఞానం అవధానానికి పర్యాయం కానేకాదు. నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైన నైపుణ్యం సృజనాత్మక ఆలోచన. అవధానం అదే నేర్పుతుంది. అవధాన వేదికపై రామాయణం వినిపిస్తుంది. మహాభారతం ప్రతిధ్వనిస్తుంది. వేదాంతం ప్రకాశిస్తుంది. తెలుగు భాషా మాధుర్యం విరాజిల్లుతుంది. సంస్కృత సంస్కృతి పరిమళిస్తుంది. అందువల్ల అవధానం ఒక వ్యక్తిని మాత్రమే తీర్చిదిద్దదు; ఒక సమాజాన్ని తన మూలాలతో అనుసంధానిస్తుంది. సామాజికస్పృహ నందిస్తుంది. సహనం, వినయంతో కళాత్మక సంభాషణా చాతుర్యాన్ని అందిస్తుంది.

అవధాని ప్రతి పృచ్ఛకుడిని శ్రద్ధగా ఆలకిస్తాడు. విభిన్న ప్రశ్నలను గౌరవిస్తాడు. అసంగతసమస్యలను చమత్కారంతో, సహేతుకంగా సమాధాన పరుస్తాడు. ఈ సంభాషణా నైపుణ్యం నేటి సమాజానికి అత్యంత అవసరం.

(మిగతా 2వ పేజీలో)

సంస్తుతి

మ. స్మయమానాంధ్రమయప్రసిద్ధకవితాసామ్రాజ్యపట్టంబు న
న్నయ కర్పించిన నీపయఃప్రసృతి కీనాఁ డాంధ్రసాహిత్యవా
జ్మయవల్లీతతి నాంధ్రలోకహృదయావాలస్థితన్ బెంచి భ
వ్యయశోభూతులు గూర్చు టొక్కవిషయంబా? తల్లి! గోదావరీ!

సి. చినిఁగిపోయిన ప్రాఁతచీర కట్టక పట్టు
కోక లేటి కటంచు గొణుఁగువారు
ముసుఁగు వేసి విభూతి నొసటిపైఁ బూయక
సింగార మే లంచు జెప్పువారు.
ఇష్టమైనట్లు లూరేఁగింప కేటి కీ
పదసౌష్ఠవం బంచుఁ బలుకువారు
పడిసువర్ణములు సంపాదింపఁ జాలక
కై సేఁతలే లంచుఁ గనలువారు
తే.గీ. నీమతము నీస్వరూపంబు నీనియమము
పాడుసేయక యుండఁ గాపాడుఁగాత.
ఆంధ్రసాహిత్యపరిషద మహరహంబు
సరసగుణపేటి! యాంధ్రభాషావధూటి!

– తిరుపతి వేంకటకవులు
(ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రికా స్తుతి)

సుహృద్వాణి

అవధాన పుష్కరిణి పత్రిక చాలా బాగా వస్తున్నది. చాలా సంతోషం.

– ఆర్. గణేశన్ (పద్మభూషణ్ పురస్కార గ్రహీత)
(కర్ణాటక)

జులై సంచికలోని 'యతివివేచనము' 'దుష్కరప్రాసలు', 'కావ్యదోషాలు' తదితర వ్యాసాలు పాఠకహృదయ రంజకంగా సులభశైలిలో సాగాయి. అవధానులనే కాక పద్యరచన చేసేవారందరూ చదువవలసిన పత్రిక ఇది.

– విజయసారథి

ప్రతి నెలా అవధానాంశాలకు సంబంధించిన ప్రతి శీర్షికా అనేక విషయాలను తెలియజేస్తూ క్రొత్త అవధానులకు మార్గదర్శకంగా ఉంటున్నాయి.

– హెచ్. రవీంద్రనాథ్, హైదరాబాద్

ఇదీ క్రమణిక

1.	సత్కవిప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం ..	3
2.	వ్యాకరణ వరివస్య … … … … … … ..	4
3.	విశిష్ట తెలుగు భాషా వైభవం… … … … ..	5
4.	ప్రహేళికా … … … … … … … …	6
5.	పద్యపరీమళం … … … … …	7,8,21,23
6.	అంశావలోకనము … … … … … … …	9
8.	అవధానవేదిక … … … … … … … …	12
9.	యతిప్రాస వివేచన… … … … … …	14
10.	శబ్దరత్నాకర నిర్మాణం	15
11.	పూరణతోరణం … … … … … … … ..	16
12.	గర్భకవిత్వంలో చిత్రకవిత్వం	17
13.	కావ్యశాస్త్రగవేషణ … … … … … … …	18
14.	ఖండశర్కర … … … … … … … … .	20
15.	కావ్యాస్వాదన … … … … … … … …	.22
16.	సంస్కృతం సంస్కృతి … … … … … ..	24

సంపాదకీయం

(1వ పేజీ తరువాయి)

భిన్నాభిప్రాయాలు శత్రుత్వానికి దారి తీయకుండా, పరస్పర గౌరవానికి దారి తీయాలని అవధానం నేర్పుతుంది. విజయాన్ని ఫలితాలతో కాకుండా అవధానం సాధనతో కొలుస్తుంది.

అందుకే మన మూలమంత్రం, "సాధనాత్ సాధ్యతే సర్వమ్."

ఈ ఒక్క వాక్యమే విద్యార్థికి, కళాకారునికి, శాస్త్రవేత్తకు, సాహితీవేత్తకు జీవితమంతా మార్గదర్శకం. అవధానం మన విద్యా విధానంలో భాగం కావాలి.

అవధానంలోని ధారణాభ్యాసం, ఆశుకవిత్వం, సమస్యా పూరణం, భాషా విన్యాసం, సమయస్ఫూర్తి వంటి అంశాలను పాఠశాల స్థాయి నుంచే పరిచయం చేయాలి.

ఇది కేవలం అవధానులను తయారు చేయడానికే కాదు; ఆలోచించగల, వినగల, గుర్తుంచుకోగల, సృజనాత్మకంగా స్పందించగల పౌరులను తీర్చిదిద్దడానికి కూడా అవసరం.

అవధానం గత వైభవానికి గుర్తు మాత్రమే కాదు; భావి భారతానికి అవసరమైన మేధాశిక్షణ.

"మనస్సును తీర్చిదిద్దండి; మేధను వికసింపజేయండి; సంస్కృతిని సంరక్షించండి; సాధనను జీవితమార్గంగా స్వీకరించండి."

ఇదే అవధాన విద్య ఉపాయనంగా భావితరాలకు అందించే సందేశం.

అవధాన కల్పవృక్షం

సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

విశేష శేముషీ విభవంతో అవధానాలు విరివిగా చేసిన పూర్వావధానులలో శ్రీ దోమా వేంకట స్వామిగుప్త గారొకరు. కర్నూలు వాస్తవ్యులైన శ్రీ వేంకటస్వామిగుప్త గారు (1891–1692) 16 సంవత్సరాల వయస్సులోనే అవధానాలు చేయడం ఆరంభించి మూడు వందలకు పైగా అవధానాలు చేసి విద్వదభినందనలకు పాత్రులయ్యారు. శ్రీ బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు, శ్రీ గద్వాల కృష్ణమాచార్యులు మొదలైన విబుధ వర్యుల సన్నిధిలో విద్యనభ్యసించిన శ్రీ వేంకటస్వామి గుప్త జగదాశ్చర్య కరావధాన కవితా సంపన్నులైన శ్రీ చెళ్ళపెళ్ళ వేంకటశాస్త్రిగారి వద్ద అవధాన విద్యకు సంబంధించిన మెళకువలను గ్రహించి అవధానాలను, ఆశుకవితాసభలను విజయవంతంగా నిర్వహించారు. వారు అవధానాలలో ఆకాశ పురాణం అనే ఒక విలక్షణాంశాన్ని నిర్వహించేవారు.

ఆయనకు గుంటూరు శతావధానంలో **'గాజులు ఘల్లుఘల్లు మన గాండివి గాండివమెత్తె రోషియై'** అనే సమస్యనీయగా ఆయన ఇలా పూరించారు.

ఉ॥ తేజమెసంగు పాండవులు తేకువ కౌరవమాయచే విరా
ట్రాజును జేరి గూఢముగ గ్రాలి ప్రతిజ్ఞయు జెల్లు నంతటన్
వేజటులార్తి గల్గునటు వేడిగ నుండియు నాజె బూనగన్
గాజులు ఘల్లుఘల్లు మన గాండివి గాండివమెత్తె రోషియై

పాండవులు కౌరవులు పన్నిన కపటు ద్యూతంలో వంచితులై అరణ్యవాసానంతరం విరాట్రాజు గారి కొల్వులో చేరి అజ్ఞాత వాసాన్ని గడుపుతూ ప్రతిజ్ఞను చెల్లించుకొంటున్న సమయంలో పేడి రూపంలో నున్న అర్జునుడు ఉత్తరగోగ్రహణ సమయంలో యుద్ధానికి సముద్యమించి చేతిగాజులు ఘల్లు ఘల్లుమని ధ్వనింపగా తన గాండీవాన్ని రోషముతో పైకెత్తాడు అని ఔచితీ మంతమైన పూరణ. గాండీవమును గాండివము – అని కూడ అనవచ్చును – అనే విషయం ఈ సమస్య ద్వారా స్పష్టమవుతున్నది.

గుప్త గారికే క్షీరపురావధాన సభలో **'సంపెంగ పూవు దీవియల సందున తుమ్మెదలాడు చుండెడిన్'** అనే సమస్య నిచ్చి పూరించుమనగా ఆ పూరణ ఇలా కొనసాగింది.

ఉ॥ ఇంపుగ నొక్కయూర గల ఈశ్వర మందిర మందు నెంతొ రా
ణింపుగ పానవట్టమున నెమ్మిని సంపెగతీవెలొప్పెడిన్
సొంపుగ నందునుల్లసిలుచున్న జలేజము జూచి ప్రీతియై
సంపెగ పూవు దీవియల సందున తుమ్మెదలాడుచుండెడిన్

ఒకానొక శివాలయంలో పానవట్టముపైన సంపెంగ పూలతీగలు వ్యాపించి ఉన్నాయి. ఆ తీవెల సందులో ఒక భక్తుడు అర్పించిన విరిసిన పద్మమున్నది. ఆ పద్మముపైన తుమ్మెద లాడుచున్నాయి – అని సమయోచితమైన పూరణ

సంపెంగ పూల సందులో తుమ్మెదలాడు చుండడమనేది సమస్యలోని ప్రకృతి విరుద్ధాంశం. సంపెంగ పూలపైన తుమ్మెదలు వాలవనేది ప్రాకృతికమైన అంశము, కవిసమయము సిద్ధము కూడా. సంపెంగను సంపెగ అని కూడ వ్యవహరింప వచ్చుననేది ఈ పద్యము ద్వారా స్పష్టము .

శ్రీ వేంకట స్వామిగుప్త కవి చక్రవర్తి, ఆశుకవి తల్లజ ఇత్యాది నైక బిరుదములచే విలసిల్లడమే కాక కనకాభిషేక, కవిగండపెండెర, గజారోహణాది ఘన సత్కారాలను పొంది అవధాన రంగంలో దేదీప్యమానంగా రాణించారు!

భరతమాత స్తుతి

సీ. తుహినాద్రి మకుటమై ద్యోధునీ వీచులై
రవళించె నెమ్మోము రత్నదీప్తి
విమల వింధ్యాద్రి తీవిగనగా కౌనున
మెరయు వడ్డాణమై మురిపమిచ్చె
ముక్తిసంధాయక మోక్షపురములేడు
ప్రాణనాడులగుచు ప్రభలనీనె
మొలబంటి జలధులు ముప్పూట నర్ఘ్యాల
నిత్య పునీతగా నిన్ను నిలిపె
తే.గీ. హరిహరాదుల దివ్యావతరణములను
వేదజననిగ నీఖ్యాతి వెల్లివిరిసె
నుత సనాతన ధర్మ సంస్తుతవు జగతి
భరత జనయిత్రి! నీ కీర్తి ప్రథితమయ్యె.

- మరుమాముల దత్తాత్రేయశర్మ

వ్యాకరణ వరివస్య 12

ఎన్.సిహెచ్. చక్రవర్తి

ఇంతకు ముందు భాగంలో తెలుగులో అచ్చుకు అచ్చు పరమైతే సంధి రాదనే విషయం చెప్పుకున్నాం.

ఇప్పుడు అత్వసంధి గురించి చెప్పుకుందాం.

అత్తునకు సంధి బహుళము (బా.వ్యా.సంధి 04) అని చిన్నయ గారి సూత్రం. అత్తు అంటే హ్రస్వ అకారం. హ్రస్వ ఆకారానికి మరో అచ్చు పరమైతే సంధి బహుళంగా వస్తుంది.

బహుళం అంటే నాలుగు విధాలు.

అత్తునకు అచ్చు పరమైతే.... (4 విధాలకు దీనిని అన్వయించుకోవాలి) 1.కొన్నిచోట్ల సంధి నిత్యంగా వస్తుంది.

2.కొన్నిచోట్ల సంధి ఎప్పుడూ రాదు.

3.కొన్నిచోట్ల వికల్పంగా వస్తుంది.

4.కొన్నిచోట్ల అన్యరూపం ధరిస్తుంది.

అత్వసంధి విషయంలో మాత్రం చిన్నయసూరి గారు ఈ సూత్రంలో పై నాలుగు సందర్భాలలో వికల్ప సంధికి, సంధిరాని రూపాలు ఉదాహరణలుగా చూపారు.

ముందుగా వాటిని పరిశీలిద్దాం.

వికల్పరూపాలు

మేన+అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు అని రెండు రూపాలు ఏర్పడతాయి. ఇక్కడ **మేన** లో ఉన్న అత్వానికి **అల్లుడు** లోని అచ్చు పరమైంది.

ఇలాంటిచోట్ల సంధి వికల్పంగా జరుగుతుంది.

సంధి జరిగితే సంధి సూత్రం ప్రకారం **మేనల్లుడు** అనే రూపం సిద్ధిస్తుంది.

సంధి రాకపోతే **సంధి లేనిచోట.... యడాగమంబగు** అనే సూత్రం ప్రకారం యడాగమం వచ్చి **మేనయల్లుడు** అనే రూపం సిద్ధిస్తుంది.

అలాగే మేనత్త, మేనయత్త మొదలైన రూపాలను గ్రహించాలి.

ఎప్పుడూ సంధి రాని సందర్భాలు

చిన్నయ గారు ఆ సందర్భాలను ఇలా వివరించారు:

బహుళ గ్రహణము చేత స్త్రీవాచక తత్సమ సంబోధనాంతంబులకు సంధి లేదు

సూత్రంలో బహుళం అని ఉండడం చేత ఎక్కడెక్కడ సంధి రాదో చెప్పారు.

1. స్త్రీవాచక శబ్దాలలో ఉన్న అత్వానికి అచ్చుపరమైతే సంధి రాదు.
2. తత్సమ శబ్దాలలో ఉన్న అత్వానికి అచ్చు పరమైతే సంధి రాదు.
3. సంబోధనల చివర ఉన్న అత్వానికి అచ్చు పరమైతే సంధి రాదు.

పై మూడు సందర్భాలలో యడాగమం మాత్రమే వస్తుంది.

ఉదాహరణలు పరిశీలిద్దాం:

అమ్మ+ఇచ్చెను = అమ్మ యిచ్చెను అనే రూపం ఏర్పడుతుంది.

అమ్మ అనేది స్త్రీవాచకం. చివర అత్వం ఉంది.

దూత+ఇతడు =దూతయితడు

దూత అనే పదం తత్సమం కనుక ఇక్కడ కూడా సంధి రాలేదు.

చెలువుడ+ఇందము = చెలువుడ యిందము అని అవుతుంది.

చెలువుడ! అనేది సంబోధన..కనుక చివర ఉన్న అత్వానికి సంధి జరగక యడాగమం జరిగింది.

నిత్యంగా సంధి వచ్చే రూపాలు:

శ్రేష్ఠతా వాచకంబులగు నార్యాంబాద్యర్థక శబ్దంబులు పరంబులగుచో నన్ని యచ్చులకు సంధి నిత్యము

(ప్రౌఢ. వ్యా. సంధి. 1)

అయ్య, అమ్మ మొదలైనవి పరమైతే అన్ని అచ్చులకు సంధి నిత్యము అని అర్థం.

ఇందులో అత్వం కూడా ఉంది కనుక ఇలాంటి చోట్ల సంధి నిత్యం.

రామ+అయ్య =రామయ్య

సీత+అమ్మ =సీతమ్మ

మొదలైనవి ఉదాహరణలు.

ఆకు పరమైనా సంధి నిత్యమే.

వేప+ఆకు =వేపాకు

మునగ+ఆకు =మునగాకు

మొదలైనవి నిత్య సంధికి ఉదాహరణలు.

అన్యరూపాన్ని ధరించే రూపాలు:

ఒక + ఒక అని ఉండగా **ఒకానొక** అనే రూపం సిద్ధిస్తుంది.

ఇది అన్యరూపానికి ఉదాహరణ.

అచ్చునకు ఆమ్రేడితం పరమైతే సంధి జరగవలసి ఉండగా ఇక్కడ అత్వసంధి లోని బహుళగ్రహణం వల్ల అన్యరూపసిద్ధి జరిగింది.

ఈ విధంగా తెలుగులో అత్వసంధి బహుళంగా జరుగుతుంది.

ఆధునికంగా వ్రాస్తున్న వర్ధిష్ణువులు ఈ ఒడుపులను తెలిసికోక అసాధుసంధులను చేస్తున్నారు. సంధి పదాలు శ్రవణాలకు ఇంపుగా వినబడాలి.

విశిష్ట తెలుగు భాషా వైభవం
12 ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

'ఛందోహీనో న శబ్దోఽస్తి, నచ్ఛందః శబ్దవర్జితమ్' అని భరతోక్తి. ఛందస్సు లేక శబ్దం లేదు. భాష అంటే శబ్దస్వరూపమే గదా! లయబద్ధమైన ప్రతి వాక్యం లేదా వాక్యఖండం ఛందః పరివేషమే.

ఛందస్సంటే కేవల త్ర్యక్షరగణ వ్యవస్థ కాదు. గానం, తదాత్మ్యమైన లయ, తాళబద్ధత, పాదనియతి. ఈ జ్ఞానం లేక కొందరు భాషలో దానికి గల ప్రాముఖ్యం మరచి, ఛందో వైముఖ్యాన్ని ప్రకటించారు.

శ్రీశ్రీ **'ఛందో బందోబస్తులు త్రెంచి అని ఛందస్సర్ప పరిష్వంగం, పద్యాల పావుకోళ్లు'** అని ఈసడించగా ఆయన తోక పట్టుకొని నడిచినవారు అలాగే వంత పాడారు. పఠాభి "పద్యాల నడుములు విరుగదన్ని" అని ఈసడించాడు. పద్యం రాయడం తెలియని పఠాభి అనడం విడ్డూరం. తన షష్టిపూర్తి సంచికలో క్షమాపణలు చెప్పినా, వీరి వాక్యాలు అనాలోచితాలు, అనాదరణీయాలు, భాషావైభవతేజాలకు చీకటి పులిమాయి.

పద్యం తెలుగు జాతి జీవనాడి. పద్యం వయస్సు 1500 ఏండ్లు. తెలుగు ఛందస్సుల గూర్చి చెప్పిన విష్ణుకుండిన నాలుగో మాధవవర్మ 1600 ఏండ్ల కింద **'జనాశ్రయ ఛందోవిఛిత్తి'** రాసినాడు. రెండువేల సంవత్సరాల క్రితమే హాలుడు తెలుగు ధవళాలు రాసినాడు. ధవళం యక్షగాన ఛందం. కంద పద్యం మాతృమూర్తియైన గాహా ఛందం తెలుగు నాట 2 వేల సంవత్సరాల క్రితం **'గాథాసప్తశతి'** రూపంలో రచింపబడింది.

తెలుగు ఛందస్సు దేశీయంగా అభివృద్ధి చెందుతూనే, సంస్కృత ఛందస్సులైన మార్గిని కూడా స్వంతం చేసికొంది. మార్గివృత్తాలకు సదృశాక్షర నియతి, ద్వితీయాక్షర ప్రాస వంటి కొత్త సొబగులు అద్దింది. రగడల్లో పాదాంత్య ప్రాస నియంత్రించి, పాటకు కొత్త అందాలు ఇచ్చింది. వృత్తాల్లో పదసమాప్తి రూపయతితో లయావైవిధ్యం అందించింది. పాదాంత యతిని సంస్కృత మర్యాదను తిరస్కరించి, పాదోల్లంఘనతో తరువాతి పాదంలోకి దూకి ప్రాసను కాపాడింది. పాటలవంటి బహుపాద వ్యవస్థను సంస్కృత వృత్తాల్లో నిలిపి ఉత్పలమాలికలు, చంపక మాలికల నల్లింది. దేశీ పద్యాల్లో లయానుగుణ గణవ్యవస్థ, గణానుగుణ పదవ్యవస్థ, పదానుగుణ యతివ్యవస్థను ఏర్పర్చింది. గణానుగుణ యతి విరామం, దానికంటే అందమైన ప్రాసయతి నియమం సొంతం చేసికొంది. తెలుగు సంస్కృత పద్యాలలో సుమారు 150 మూసల (పద్యాలు) సృష్టించుకొని కవి కల్పనామయ, భావనామయ, ధైర్యానికి దగ్గ ఛందస్సులు సిద్ధం చేసికొంది. ఇన్ని వైవిధ్యాలు సోదర ద్రావిడ భాషల్లోగాని, సంస్కృత, ప్రాకృతాది హిందార్య భాషల్లో గాని లేవు. తెలుగు జాతిని వికాసానికి, తెలుగు భాషా వికాసానికి ఒకటిన్నర సహస్రాబ్దుల ఛందోవైభవం అనితర భాషా ప్రయుక్తం, అద్భుతం.

యతి, ప్రాసగల పద్యాలు, యతిగల పద్యాలు, ప్రాసలేని పద్యాలు, ప్రాసయతి గల పద్యాలు, త్ర్యక్షర గణక పద్యాలు, సూర్యేంద్ర చంద్రగణ పద్యాలు, గగభజసనల (చతుర్మాత్రా) గణపద్యాలు, మాత్రాగణ పద్యాలు, తాళగణ పద్యాలు ఎన్ని వైవిధ్యాలో! ఎన్నెన్ని నడకలో!

భాషాభివృద్ధిలో ఛందస్సు పాత్ర సామాన్యమైందేమి కాదు. ఛందస్సు వల్ల మౌఖిక సంప్రదాయంలో సాహిత్యం నిలిచింది. అవిద్యావంతులైనా స్వచ్ఛమైన, నుడికారశోభితమైన తెలుగును ఉపయోగించేవారు. దీనికి కారణం శతకాలు, యక్షగానాలు, గేయాలు. ఛందశ్శోభితాలు కనుక లయబద్ధాలు, సులభకంఠస్థాలు, మరపులోనికి జారనివిగా తెలుగువాని జీవితంలో నిలిచాయి.

నిజజీవితంలో వృత్తాలకంటె దేశిచ్ఛందస్సుల పాత్ర పెద్దది. కొన్ని శతకాల్లో వృత్తాలు కంఠస్థం, ప్రాథమిక విద్యలో చేసినా, చేయనక్కరలేనివి దేశీ పద్యాలు. వేమన ఆటవెలదిని అందుకొన్నాడు. జీవిత సత్యాలెన్నిటినో అందించాడు. తొలి రెండు పాదాల్లో సమాజం, మూడోపాదం పైరెంటివల్ల లభించిన జీవనసత్యం, నాల్గోపాదం మకుటం సరేసరి. అన్ని పాదాల పాదాంత విచ్ఛేదంలో తెగి సులభంగా ఒకసారి వినినంతనే కంఠస్థం అయ్యేది.

అనువుకాని చోట అధికుల మనరాదు
కొంచెముండుటెల్ల కొదువకాదు
కొండ అద్దమందు కొంచెమై ఉండదా?

ఈ ఆటవెలదిలో ఒక్కో పాదమే సంభాషణల్లో ప్రయోగించే వారు. ఇది ఆటవెలదిలో గణవ్యవస్థలోని వెసులుబాటు. ఇది వేమనశైలి. ఈ నడకలు బుర్రలోకెక్కి ఛందస్సు తెలియకున్నా పద్యాలు రాసేవారు.

ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా
నలుపు నలుపే కాని తెలుపు కాదు– అని అల్లుకునేవారు. ఈ అల్లకం వేమనే రాసాడనుకొన్న త్రిసహస్రాధిక పద్యాల సంఖ్యకు దారితీసింది. ఇవన్నీ వేమన రాసాడా? ఆయన ఛాయాపురుషులు రాసారు. వారు పండితులా. కాదు కదా! చదువురాకున్నా నడకల్లో అల్లగల భావుకులు.

మారిషస్ దేశంలో ఇపుడున్న ఐదో తరానికి మూలపురుషులు తెలుగువారు. బ్రిటిషు వారి బందీలుగా శ్రీకాకుళ విశాఖ పట్నాల పల్లె ప్రాంతాల ఓడల కళాసీలు, కార్మికులు. వారు తమకు కంఠస్థంగా ఉన్న నరసింహ శతకాన్ని, దేహంతోపాటు మనసులో పెట్టుకొని వెళ్ళి, చీకటి కొట్టాల్లో కొరడా దెబ్బలు తింటూ స్వామిని వేడుకుంటూ, స్మరించుకుంటూ నిలుపుకొని, కాగితం, కలం లేకున్నా తరువాతి తరాల కందించారు. వారికిప్పుడది వేదంలా పండుగల్లో ప్రయుక్తం కావడం నేను ఆ దేశంలో చూసాను. ఇది సీసచ్ఛందంలో శేషప్ప రాసినందువల్ల మనందరి మనః పేటికల్లో సజీవం. రెండు వందల సంవత్సరాలు తెలుగు రాజ్యాల్లో వీధిబడి పాఠ్యం. నాటి విద్యార్థులు కంఠస్థం చేసే చిన్నపద్యం కృష్ణశతకం కందపద్యం – కాకుత్థ్సం నరసింహదాసు (మనుమడు), పెద్దపద్యం నరసింహశతకం శేషప్ప (తాత) రాసినవి. ఎందరికో పదుల్లో కంఠస్థాలు. వీధిబళ్లు పోయినా, నేటి ఆధునిక విద్యావిధానంలో చదివిన వారికి కూడా జీవితంలో పదిసార్లైనా పాడేవే.

కం. హరి యను రెండక్షరములు
హరియించును పాతకంబు లంబుజనాభా! అనో
సీ. తల్లిగర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్లిపోయేనాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారమ్ము మింగబోడు అనో

ఈ ఇద్దరు రాసిన పద్యాలు ఛందో బద్ధత కారణంగా కంఠస్థం లేవా? వీరిద్దరు తాతమనువలు తరతరాల భక్తి నిధినందించారు. ధర్మపురి గోదావరి తీరస్థ నారసింహ క్షేత్రవాసులు. (వీరి నాలుగు శతకాలు చతుశృతిగా ముద్రించాను.) అది ఛందానికి, భాషా వైభవానికీ గల లంకె.

రగడల వంటి గేయచ్ఛందస్సుల వల్ల జానపద గీతాలు కంఠస్థాలు. జానపద కవులెందరో రచనలు చేసారు. వరకవులనే సంప్రదాయంలోని కవులు భక్తిసాహిత్యాన్ని కల్పించారు. భజన పాటల సంగతి చెప్పేదే లేదు. రామదాసైనా, త్యాగరాజైనా ఈ సంప్రదాయంలోని వాగ్గేయకార లక్షణాలను, ద్వితీయాక్షర, అంత్యప్రాసలను, తాళగణాలను నడకలను స్వీకరించినవారే. గేయఛందస్సులు వీరి జీవితంలో భాగం.

సామాన్యులైన జానపదులైన బర్లు, గొర్లు కాసేవారు సైతం పాడుకునే పద్యాలు నాటకాల్లోవి. తిరుపతి వేంకటకవుల నాటక పద్యాల్లోని ఛందస్సులు, వృత్తాలా? దేశీ పద్యాలా తెలియనివారైనా హాయిగా పాడుకునేవారు. తప్పులున్నా నడకలు ముఖ్యం. పాండిత్యం లేకున్నా పాడటం ప్రధానం. "మానవాధీశ్వరా! మణుగు నాలుక వాడు" అని పాడితే మనువు నాల్గవవాడు (పోతన్న పద్యం) అని మనం సర్దుకొంటాం. (సశేషం)

ప్రహేళిక

మన కవులు చాలా ప్రతిభావంతులు. ఎలాంటి సందర్భనైన్నా చమత్కారంగా చెప్పగలిగే సమర్థులు. అలాంటి ఒక చమత్కారమైన పద్యం చూద్దాము.

స్వామీ! ఏమిటి? పేరు వచ్చెడి యదృష్టంబుండు తార్కాణమెం
దే? మృత్యుంజయులందెగా! యముని రొమ్మే దన్నితిన్ దేనితో
వామాంఘ్రిన్ యది నాదిగా యనుచు నవ్వన్ గౌరి స్మేరాస్యుడౌ
వామాంఘ్రీకృత సర్వమంగళుడు సౌభాగ్యమ్ము మీకిచ్చుతన్!

ఇది పార్వతీ పరమేశ్వరుల ప్రణయ సంభాషణ. పార్వతీదేవి శివుణ్ణి 'స్వామీ!' అని పిలిచింది. 'ఏమి' అన్నాడు. 'ఏమీ లేదు లోకంలో మంచి పేరు రావాలంటే అదృష్టముండాలి' అన్నదట. 'ఎందుకు' అని పరమేశ్వరుడు అడిగితే 'మీకు మృత్యుంజయుడు అనే పేరు ఉంది కదా! అది మీ అదృష్టం' అన్నదట. అంటే శివుడు అన్నాడు 'అది నేను కష్టపడి సంపాదించుకున్న బిరుదు. మృత్యువును జయించాను. తన్నినాను మార్కండేయుని రక్షించే సమయంలో' అన్నాడట. అప్పుడు పార్వతి 'ఓహో! గొప్పపని చేశారు. దేనితో తన్నారు?' అని అడిగింది. అప్పుడు శంకరుడు 'వామాంఘ్రిన్ నా ఎడమకాలితో తన్నినాను' అని చెబుతాడు. వెంటనే అమ్మవారు 'అది నాదిగా' అంటుంది.

పరమేశ్వరుడు అర్ధనారీశ్వరుడు కదా! ఎడమభాగం అమ్మవారు, కుడిభాగం ఈశ్వరుడు. అంటే 'నా కాలితో తన్నినావు నీకు పేరు వచ్చింది. ఇందులో నీ గొప్పతనం ఏముంది?' అని పరిహాసం ఆడింది.

అలాంటి 'వామాంగీకృత సర్వమంగళుడు'. ఎడమభాగంలో పార్వతీదేవి దేహంలో ప్రకాశిస్తూ ఉన్న ఆ పరమేశ్వరుడు మీకు మాకు మనందరికి సకలసౌభాగ్యాలు ఇచ్చి కాపాడు గాక! అని ఆశీఃపురస్సరముగా పార్వతీపరమేశ్వరుల శ్లోకం చమత్కారంగా ఉంది కదా!

- 'అవధాని' ముత్యంపేట గౌరీశంకర శర్మ

పద్యపరీమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

అద్వితీయ పద్యద్వయం

ఉ. శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారకహారపంక్తులం
జారుతరంబులయ్యె, వికసన్నవ కైరవగంధ బంధురో
దారసమీరసౌరభము దాల్చి, సుధాంశువికీర్యమాణ క
ర్పూరపరాగపాండు రుచిపూరము లంబరిపూరితంబులై
(అరణ్య 4-142)

చం. స్ఫురదరుణాంశు రాగరుచి బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై, దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల, ను
ద్ధురతర హంససారసమధువ్రత నిస్వనముల్ సెలంగగా
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళ జూడఁగన్
(అరణ్య 4-143)

వర్షర్తువు ముగిసి శరదృతువు ప్రవేశించినది. ఇది శరదృతు వర్ణనము. నన్నయ కథాగమనమునకు అధిక ప్రాధాన్యము నిడి వర్ణనములను పట్టించుకొనలేదను ప్రథ గలదు. కథాగమనము మందగించకుండ చూచు క్రమములో వర్ణనములను అధికముగా చేయని మాట వాస్తవమే కానీ, చేసిన పట్టుల పద్యములు అత్యంత మనోహరముగా భావప్రౌఢిమతో, అక్షరరమ్యతతో నొప్పుచున్నవి. నిజమునకు భావి కావ్యకర్తలకును ప్రబంధకవులకును మార్గదర్శన మొనర్పగల వర్ణనములను చేసినాడు నన్నయ. శృంగారాది రసములను, పురాదులను, ఋత్వాదులను, యుద్ధములను, మనోభావములను, - ఏ వర్ణనమును చేపట్టినను అనవద్యమై, సహృదయ హృదయరంజకమై, కాలపరీక్షకు తట్టుకొని నేటికినీ నిలబడునట్లే చేసినాడు.

అట్టి అద్భుతమైన వానిలో ఒకటి ఈ పై పద్యములలో మొదటిది. శరత్కాలము (ఆశ్వయుజ కార్తిక మాసములు) నిసర్గాహ్లాదకరమై యొప్పుచుండును. అందునను రాత్రి వేళలు. అందునను శరత్ సంపూర్ణ పౌర్ణమి రాత్రులు. అట్టి ఒకానొక రాత్రి వర్ణన మీ పద్యము.

విస్పష్టముగా ప్రకాశించుచున్న తారాహారావళితో, చంద్ర దర్శనముతో వికసించుచున్న తెల్ల కలువలు వెదజల్లెడు సౌరభములను ధరించిన వాయువును పూని, చంద్రునినుండి నిర్గతమయిన కర్పూరపాంశువు వంటి తెల్లని కాంతిప్రవాహములు ఆకాశమంతటను నింపబడగా (వఱచుకొనగా) శారదరాత్రులు ముందటికంటె అతిశయించి సౌందర్యమంది ఆహ్లాదమును కలుగజేయుచున్నవి.

ఈ పద్యమున కర్థమింతే. కానీ విశ్వనాథ వంటి విద్వాంసుల దృష్టినైశిత్యము శబ్దముల మధ్యలోనికి చొచ్చుకొనిపోయి "లో నారసి" రంధ్రాన్వేషణము చేసినది. పాండురుచి పూరములం + పరిపూరితంబులై (తెల్లని కాంతిప్రవాహములచే నింపబడినవై) అను పదబంధమును పాండురచి పూరములంబరపూరితంబులై (రుచిపూరములన్ + పరపూరితంబులై) యను పాఠమును గ్రహించి, తదుపరి కావ్యమంతయును ఇతరులచే పూరించబడునను అర్థమును సాధించిరి. దీనికి కారణము ఈ పద్యము నన్నయగారి చివరి పద్యమగుటయే. అయినను విశ్వనాథ వారే చెప్పినట్లు "ఋషి వంటి నన్నయ్య" అప్రయత్నముగనే భవిష్యత్తును పలికినాడేమో! దీని మూలముగా విశ్వనాథ వారి సూచన "(ఎట్టి పరిస్థితిలోను) కవిత్వములో అశ్లీలము రాకూడదనుట కిదియొక సాక్ష్యము కావచ్చును" (సాహిత్యసురభి పుట 45).

ఆ రాత్రికి నన్నయ్య శాశ్వతనిద్ర జెందినాడు. మరల మూడు శతాబ్దముల పిమ్మట ఆ యరణ్యములోననే ఎఱ్ఱాప్రెగ్గడ మేల్కాంచినాడు. ఎట్లు మేల్కాంచెను? నన్నయ ఏ ప్రజ్ఞతో నిద్రజెందినాడో సరిగా అదే ప్రజ్ఞతో మేల్కాంచినాడు. అందులకు ఉదాహరణము రెండవ పద్యము. మొదటిది నన్నయగారి చిట్టచివరి పద్యము కాగా రెండవది ఎఱ్ఱన గారి (భారతములో) మొట్టమొదటిది.

సూర్యోదయాత్పూర్వము కాషాయవర్ణము ఆకాశమందంతటను ప్రసరించును. ఇది అరుణోదయము. ముందుగా సారథియైన అరుణుడు తదుపరి రథియైన రవి కనుపించినారు. ఈ యరుణకాంతి మేఘములను ఆవలకు తొలగించుచు స్ఫురించగనే, తమ నాథుని రాకను పసిగట్టిన కమలములు వికసించుచు తమ వైభవమును చూపినవి. మొదటగా పక్షులు మేల్కొన్నవి. మాగన్నుగా నున్న హంసలు, బెగ్గురు పక్షులు, తుమ్మెదలు మెల్ల మెల్లగా మేలుకొనుచు తమ తమ యునికిని చాటుచున్నవేమో యన్నట్లుగా తమ భాషలో కలస్వనములు చేసినవి. ఈ విధముగా అరుణోదయకాంతులు, కమల వైభవములు, జలపక్షుల నిస్వనముల విజృంభణముతో శరత్కాలమునందలి వాసరముఖములు (పగటికి ప్రవేశ ద్వారములైన ఉదయవేళలు) వెలిగిపోయినవి.

ఇష్టదేవతా స్తుతి కూడా చేయకుండగానే రచనారంభము చేయవలసిన ఆగత్యము పట్టినది ఎఱ్ఱనకు. తదుపరి,

నన్నయగారి చివరి పద్యము వలెనె తన మొదటి పద్యము ఉండవలె. అయినను తగ్గలేదు. వర్ణనమును కొనసాగించినాడు. నన్నయ చివరి పద్యము గురువుతో మొదలైనది. ఇక్కడ తగ్గినాడు ఎఱ్ఱన. తాను లఘువుతో ఆరంభించినాడు. అట్లని ఏ మత్తేభముతోనో, దేశీచ్ఛందస్సు తోనో కాక, నన్నయకు అత్యంత అభిమానపాత్రమైన చంపకోత్పలములలోని చంపకమలతోనే మొదలిడినాడు.

ఈ ఎఱ్ఱన పద్యము నన్నయ పద్యమున కేవిధముగను తీసిపోనట్లుగా నున్నది. ఒక దృష్ట్యా రెండును ఒక్కరే వ్రాసినట్లు భ్రమ కలుగుతుంది. విశ్వనాథవారి ప్రకారము "నన్నయగారి శైలిని యీ మాత్రము సాధింపగలిగిన వాడు తెలుగులో నింకొకడు లేడు".

షడరచక్రబంధ శార్దూలము

- చింతా రామకృష్ణారావు



శా. దుర్గా! రా! కను రేని భారము, భజింతున్, సూర్యునుష్ణమ్ము! మా
వర్గా! మజ్చేగ నాలకించుము లసద్వాగ్ రీతివై కమ్ము, నీ
భర్గా కృష్టి తటిల్లతాద్భ్వమున మా వాఁడుద్ధతిన్ విచ్చు, మా
మార్గంబందున బ్రోవఁగా బ్రభలతో మావెంట నీవుండుమా!

పద్యపరిమళం

శోకముఁ బొందినవానిన్
భీకర రోగములు సెందున్, బృథులార్థంబుల్
సేకుఱవు వాని కెప్పుడు
శోకము గని విడుచువాఁడు సుజ్ఞాని నృపా!

భాస్కర రామాయణం అరణ్యకాండ 2-250

సీతను రావణాసురుడు ఎత్తుకుపోయిన తర్వాత రాముడు శోకసంద్రంలో మునిగిపోతాడు. ఆ సందర్భంలో రాముడిని ఊరడిస్తూ లక్ష్మణుడు మాట్లాడిన సందర్భంలోనిది ఈ పద్యం.

ఓ రాజా! శోకమనేది రోగాలకు మూల కారణం. దానివల్ల భవిష్యత్తులో సాధించవలసినవి మూలకు పడుతాయి. అటకెక్కుతాయి. శోకం ప్రతి వ్యక్తి జీవితంలో సర్వసాధారణం. దానిని అతి మామూలు విషయంగానే భావించాలి. శోకం విషయంలో ముట్టీముట్టనట్లు వ్యవహరించాలి. నెత్తి మీద కుంపటిలా దానిని భావించకూడదు.

విశేషాంశం: రాముడు అరణ్యవాసం చేస్తున్నాడు. అయోధ్యలో పట్టాభిషేకం భంగం అయింది. అయినా లక్ష్మణుడు రామున్ని రాజుగానే భావిస్తున్నాడు.నృపా! అన్న సంబోధన ఈ విషయాన్ని తెలుపుతున్నది. మామూలు వ్యక్తికైతే శోకం ఒక పెద్ద సవాలు. కానీ అనుకోని విపత్కర పరిణామాల వల్ల అరణ్యవాసం చేయాల్సి వచ్చిన కారణజన్ముడైన రామునికి అది పెద్ద సంగతి కాదు."ఈ తాత్కాలిక కష్టాల నుండి నువ్వు బయట పడతావు. సీతమ్మ దొరుకుతుంది. మళ్ళీ నువ్వు అయోధ్యకు రాజు అవుతావు"అన్న అంతరార్థం ఈ "నృపా!"అనే సంబోధనలో కొంచెం లోతుగా చూస్తే కనబడుతుంది.

అంతేకాదు. ఇలా శోకించుకుంటూ కూర్చుంటే నీవు ఏ లక్ష్యం కోసమైతే ఈ మానవజన్మను ధరించావో అది నెరవేరకుండా పోతుంది అన్న హెచ్చరిక కూడా "పృథులార్థంబులు చేకురవు"అన్నమాట వెనక బలంగా వినిపిస్తుంది.

లక్ష్మణుడు ఒక వైపు శోకం గురించి చెప్తూనే మరొకవైపు రామునికి తన కర్తవ్యాన్ని గుర్తు చేయడం ఈ పద్య విశిష్టత. ఇలాంటి గొప్ప పద్యాన్ని రాసిన భాస్కర రామాయణ కర్తకు జోహార్లు.

- సంబరాజు రవిప్రకాశ్

అంశావలోకనం

శతావధాని ఆముదాల మురళి

కవితల వేల్పు గిడ్డి అవధాని రామారెడ్డి

తెలుగు సాహిత్యానికి మకుటాయమానము, ప్రత్యేకమైన ప్రక్రియలు రెండు. అందులో మొదటిది పద్యనాటకం, రెండవది అవధానం. వాటిలో కూడా ఉత్తరోత్తరం బలీయం. ప్రాచీనులైన భట్టుమూర్తి, చరిగొండ ధర్మన మొదలగువారు అవధానాలు చేసినట్లు సాహిత్య చరిత్ర వల్ల తెలుస్తూ ఉన్నా వాటి స్వరూపం ఇదమిత్థంగా తెలియరావడం లేదు. ఆధునిక కాలంలో వేదికల మీద ప్రదర్శింపబడుతున్న అవధాన స్వరూప రూపకర్త మాడభూషి వేంకటాచార్యులు.

1872 ఫిబ్రవరి 21వ తేదిన మాడభూషివారు నూజివీటి సంస్థానం అగిరిపల్లెలో మొట్టమొదటి అవధానం చేశారు. అటుపై దేవులపల్లి సోదరకవులు, తిరుపతి వేంకటకవులు, కొప్పరపు సోదరకవులు, వేంకట రామకృష్ణ కవులు, వేలూరి శివరామశాస్త్రి, మొదలగువారు, అవధాన అరంభదశను సుసంపన్నం చేసిన ప్రతిభామూర్తులు.

పద్య కవిత్వానికి, అవధానసాహిత్యానికి రాయలసీమ పట్టుగొమ్మ. ముఖ్యంగా అవధానరంగంలో విఖ్యాతిపొందిన శత, సహస్ర, అష్టావధాను లెందరో ఉన్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క ప్రత్యేకశైలి. ఒకరి పద్యం వేగం, మరొకరిది రాగం – ఇలా ఎవరికి వారు అవధానాన్ని, పద్యాన్ని నిలబెట్టి యశోమూర్తులయ్యారు. పద్యాన్ని సుకుమారంగా, లలితంగా నడుపుతూ వేగాతివేగోక్తియైన అవధానంలో కవిత్వాన్ని ప్రతిష్ఠాపన చేసి సరస్వతీ సమర్చన చేసిన అవధాన సార్వభౌములు శ్రీ నరాల రామారెడ్డిగారు.

శ్రీ రామారెడ్డిగారు 1949 మే 18న జన్మించారు. వారి తల్లిదండ్రులు శ్రీమతి వెంకటమ్మ, శ్రీ బాలిరెడ్డి గారలు. కడపజిల్లా ప్రొద్దుటూరు మండలం బొల్లవరం వారి జన్మస్థలం. ప్రొద్దుటూరు, తిరుపతి నగరాల్లో విద్యాభ్యాసం చేసి విద్వాన్ పట్టాపొందారు. 1968లో ప్రొద్దుటూరు ప్రాచ్యకళాశాలలో ఉపన్యాసకులుగా ఉద్యోగజీవితం ప్రారంభించిన శ్రీ నరాలవారు కళాశాల అధ్యక్షులుగా ఉద్యోగ ఉన్నతిని పొంది 2007లో పదవీ విరమణ చేశారు.

విద్వాన్ చదువుతున్న రోజుల్లో వారిలో అవధాన బీజావాపం జరిగింది. అది అంకురించి, చిగురులు తొడిగి, పుష్పించి, ఫలించి విస్తృత శాఖోపశాఖలతో మహావృక్షమై సత్కవిత్వరస ప్రపూర్ణ పద్యఫలాలను ఆంధ్రజాతికి, నిరుపమాన యశస్సును శ్రీరామారెడ్డి గారికి నిరవద్యరత్నాలంకారాలను ఆంధ్ర సారస్వతమునకు సమకూర్చింది. కళావాచస్పతి, శిరోమణి ఇత్యాది బిరుదులే కాక అవధాన ప్రతిభాపురస్కారం(1993), ఉగాది పురస్కారం వంటివి వారిని వరించాయి.

శ్రీనరాల రామారెడ్డిగారు పదహారేళ్ళ ప్రాయంలోనే అవధానం ప్రారంభించారు. 1965 నుండి రాష్ట్రరాష్ట్రేతర ప్రాంతాల్లోనే కాక విదేశాల్లో కూడా అవధానాలు చేశారు. మహామహులైన పండితుల సమక్షంలో తన కవితాపీయుషధారాప్రవాహంలో అవధానాలను నిర్వహించి, అవధానానికి సరిక్రొత్త నిర్వచనాలను ఇచ్చారు. మాటల్లో చమత్కృతి, పద్యాల్లో కవిత్వరసావిష్కృతి, అవధానానికి సమలంకృతులై శ్రీ నరాల భారతి పురస్కృతి నందుకొన్నది. వారిని గూర్చి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు,

ధారణయున్నచో మధురధార లభింపదు; ధారయున్నచో
ధారణ సున్న; ధారణము ధారయు కల్గినచో కవిత్వ పుం
సారములేదు; ధారణయు సారము ధారయునున్న వాక్చమ
త్కారము రాదు; నాల్గు కనగల్గును వడ్డికి రాదు రెడ్డికిన్.

అన్నారు. ఇందులో కరుణశ్రీ గారు శ్రీరామారెడ్డిగారిని ప్రశంసిస్తూనే అవధానికి నాల్గు ప్రధాన లక్షణాలుండాలని పేర్కొన్నారు. మధురమైన పద్యధార ఉండాలి, అంటే పద్యం కుంటకుండా సాఫీగా సాగాలి. రెండవ అంశం ధారణ. మనఃఫలకంపై రూపు దిద్దుకొన్న మనోహరభావం పద్యపాదమై వైఖరీరూపాన్ని ధరిస్తుంది. ఏ భావం, ఏ రూపాన్ని ధరించి బాహ్య ప్రపంచంలోనికి ప్రసరించిందో దాన్ని అలాగే ధీశక్తిలో నిల్పి, అవధానంతమున అప్పజెప్పడం ధారణ. అవధానానికి ఇది ప్రాణతుల్యమైనది. ధారాపాతంగా పద్యం చెప్పి తిరిగి అప్ప చెప్పకపోతే అది అవధానమే కాదు. ఇక మూడవ అంశం ధారా, ధారణతో పాటు 'కవిత్వపుంసారము' అన్నారు. పద్యపాదం వెదురుగడ వలె కాక చెఱుకుగడ వలె ఉండాలి. కవిత్వం యొక్క ప్రాథమిక లక్షణం ఆలోచనామృతం. శ్రోతకు కవిత్వామృతాన్ని పంచే రమణీయ భావబంధుర పద్యం అవధానంలో అల్లాలి. చివరగా కరుణశ్రీగారు పేర్కొన్న చతుర్థాంశం 'వాక్చమత్కారం'. అవధానం ప్రదర్శనప్రక్రియ. ప్రేక్షకులలో సద్యోరసోత్పత్తి జరగాలి. అలా జరగాలంటే అవధాని 'కొంటెలలోన కొంటె'గా మాత్రమే ఉండి అవధానం అంటే చిల్లర మాటల్లో చెల్లని పద్యాల

నేరుకోవడంగా దిగజార్చడం కాదు, ధ్వని, వక్రోక్తి, రసాలంకార వైభవమైన ప్రసంగ సంగతుల నడుమ ధీరగంభీర భావాకృతియైన పద్యమల్ల గలగాలి, సౌరభాయత్తమైన విరుల తోటలో రసస్యంది యైన ఫలాన్ని కోసుకొన్నట్లు ప్రేక్షకుడు అనుభూతించాలి. ఈ నాలుగు అవధాన మంటపానికి నాలుగు స్థంభాలు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా అవధాన మంటపం ఒరిగిపోతుందని కరుణశ్రీ గారి అభిప్రాయం.

ఈ నాలుగు లక్షణాలు శ్రీ రామారెడ్డి గారి అవధానంలో పుష్కలంగా ఉన్నాయని, ప్రత్యక్ష సాక్షిగా, అవధాన పృచ్ఛకుడుగా కరుణశ్రీగారు కితాబు నిచ్చారు. సమకాలీన అవధానాలపై కరుణశ్రీగారు చేసిన సమీక్షగా ఈ పద్యం నిలువడమే కాక శ్రీ నరాల రామారెడ్డిగారి స్థానాన్ని కూడా నిర్దేశించి నిశ్చయించింది.

పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల వారు వారి సమకాలీన అవధానులను గూర్చి "ఏవో శాబ్దిక చిత్రముల్ నెఱపి, తామే శబ్ద రాహస్య నిష్ఠా వాచస్పతులంచు క్రొవ్వెదరు శుంఠల్, గర్వ కుక్షింభరుల్" అన్నారు. అంటే అప్పటికి ప్రసిద్ధిగాంచిన అవధానులలో కొందరు కేవలం శబ్దాడంబరంతో అవధాన పద్యాలను అల్లి 'మమ' అనిపిస్తూ ఉండటమే గాక గర్వంతో తామే శబ్దరహస్యాలెరిగిన వారమని భావిస్తున్నారని ఆక్షేపిస్తూ "నీవైనన్ రససిద్ధసత్కవివచోనిర్మాణపాథేయవత్ భావాధ్వమ్ముల సంచరింపుమురవత్సా" అని కర్తవ్యబోధ గావించారు. శ్రీనరాల వారు రససిద్ధిని పొందిన సత్కవుల మార్గాన్ని వీడలేదు, రసహీనమైన పద్యం చెప్పలేదు. అందులకు వారి అవధాన సౌరభం నిలువెత్తు నిదర్శనం.

ఆశుకవితాధార ప్రధానంగా సాగే అవధానంలో ప్రాముఖ్యమైన అంశాలు నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, న్యస్తాక్షరి, వ్యస్తాక్షరి, వర్ణన, ఆశువు మొదలగునవి. వీటిల్లో ఆశువు మినహా మిగిలినవి ధారణాంశాలు. నిషిద్ధాక్షరి బాహాబాహీగా జరుగుతుంది. ఉద్దిష్టార్థసాధనకు అవధాని ప్రయత్నం చేస్తుండగా దాన్ని అడ్డుకోవడానికి ప్రాశ్నికుడు ప్రయత్నిస్తాడు. అటువంటి స్థితిలో కూడా అర్థవంతమైన పద్యాలను ప్రభావంతంగా అల్లిన అవధాన కంఠీరవులు శ్రీ నరాల రామారెడ్డిగారు.

యర్రగుంట్ల అవధానంలో సాహిత్య సభను గూర్చి నిషిద్ధాక్షరి అడిగితే నరాలవారు చెప్పిన పద్యం ఇలా ఉన్నది.

వారిద మాలా శుద్ధా
కారము, పద్మదళరంజకప్రథహంసా
ళీరూపము భారాజత్
సారస్వత సభ వెలుంగు సత్కవనమునన్

సారస్వత సభ మేఘాల పంక్తి వంటి ఆకారాన్ని కలిగిందని అనడం వల్ల మేఘం నుండి వర్షం కురిసినట్లు సభనుండి సారస్వతరసవృష్టి కురుస్తుందని ధ్వని. "పద్మదళ రంజక ప్రథహంసాళీరూపము' అనడం వల్ల నీరక్షీరన్యాయం స్ఫురించి సభలోని వారు హంసల వంటి వారని, కీర్తి ప్రభాభాసితులని చెప్పడమే కాక పద్మమును, హంసను పేర్కొనడం వల్ల సరస్వతి అక్కడ ఉన్నట్లు ద్యోతకం చేయడం... నిషిద్ధాక్షరి పద్యనిర్మాణంలో ఇంత ప్రణాళికను అమలు పరచడం అనన్య సాధ్యం. పద్యంలో ఎక్కడా గణం కోసమో యతి ప్రాసల కోసమో వేసిన ఊతపదాలు గాని, వ్యర్థ పదాలు గానీ లేవు. ప్రత్యేకించి రెండవ పాద నిర్మాణంలో ఒక విశిష్టత ఉన్నది. పాదం 'కా'తో ప్రారంభమైనది, పద్మదళ తరువాత అవధాని రేఫాన్ని వేశారు. ఎంతటి ప్రాశ్నికుని కైనా 'మ్య' స్ఫురించకపోదు. ఒకవేళ 'మ' నిషేధం చేయకపోతే ప్రేక్షకులు కూడా నోరుచప్పరించగలరు. అర్థానుగమనమైన నిషేధమే అవుతుంది. బహుశా పృచ్ఛకుడు కూడా అదే నిషేధించి ఉండవచ్చు. ఎందుకంటే ఆ అక్షరంవేస్తే ఆరోగణం జగణం రావడమే కాక తరువాతి అక్షరం యతిస్థానం కనుక నిషేధం ఉండదు. ఇదంతా సాధారణ నిషేధాక్షరి ప్రణాళిక. ఇక్కడ అవధాని రేఫం తర్వాత బిందు పూర్వక 'జ' వేశారు. మరొక స్థానంలో అయితే పృచ్ఛకుడు క నిషేధించేవాడు, అది యతి స్థానం అందువల్ల "పద్మదళ రంజక' అనగలిగారు. అంతటితో ఆగక 'క'ను గురువు చేసే ప్ర వేయడం. ఇది నరాల వారి నిషిద్ధాక్షరి ప్రణాళిక. యతిస్థానం కాకుండా వేరొక చోట అయితే కను నిషేధిస్తే 'న' వేసుకొని 'రంజన' గా మార్చగల ప్రణాళిక అవధానికి ఉన్నట్లు స్ఫురిస్తున్నది కదా! నిషిద్ధాక్షరి పద్యాలు భూతోచ్చాటన మంత్రాల వలే ఉంటాయన్న అపప్రథను దూరం చేయగల పద్యాలల్లిన అవధాన సుధాకరులు శ్రీ నరాల రామారెడ్డిగారు.

నిషిద్ధాక్షరి పద్యంకంటే కూడా అవధాని సమస్యను ఎలా పూరిస్తాడు? దత్తపదాలను ఎలా విరుస్తాడు అని ప్రేక్షకులు ఎదురు చూస్తుంటారు. చమత్కారవంతంగా సమస్య పూరింప బడితే అవధానం ఎంతో రక్తి కడుతుంది. అయితే అలా పూరించడానికి అవకాశం ఉన్న సమస్యలను పృచ్ఛకులు ఇవ్వాలి. అంటే పృచ్ఛకుడు కూడా సరస పండితుడై ఉండాలి. అలా కాకుండా కొందరు అవధాని ప్రతిభను పరీక్షించాలని సమస్య కాని సమస్యలను, దుష్కరప్రాస ఉన్నవాటిని ఇస్తూంటారు. అవధాని ఏదోరకంగా పూర్తి చేస్తాడు కాని ప్రేక్షకులకు నిరాశే మిగులుతుంది. మంచి సమస్య, చతురుడైన అవధాని చేతిలో

పడితే, అది ఎంతటి రసరమ్యమైన పద్యమవుతుందో అవధాన సౌరభం చెబుతుంది.

సమస్యకు ప్రాథమిక లక్షణం వైరుధ్యం. పౌరాణిక పాత్రల మధ్య, బంధుత్వాల మధ్య, ప్రాకృతికాంశాల మధ్య, సహజ సామాజికాంశాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని లేనట్లు చెప్పడం, లేదా లేని వైరుధ్యాన్ని కల్పించడం సమస్యా నిర్మాణానికి అక్కరకు వచ్చే అంశం. ఆ వైరుధ్యాన్ని తొలగించడమే సమస్యాపూరణం.

ఈ వైరుధ్యాన్ని తొలగించడానికి అవధానికి అనేక మార్గాలు ఉంటాయి. వాటిలో సముచితమైనదాన్ని ఎన్నుకొని పద్యనిర్మాణం చేస్తాడు. ఇది పూర్తిగా అవధాని స్ఫురణమీదే ఆధారపడి ఉంటుంది. ఏదీ స్ఫురించనప్పుడు కథాకల్పన, క్రమాలంకారం, స్వప్న వృత్తాంతం, శకారుని మాటలు, త్రాగుబోతు, పసిపిల్లల మాటలు, బొమ్మలాటలు, నాటకం, ప్రశ్న... ఇలా ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకొని అవధాన పద్మవ్యూహాన్ని దాటి వచ్చేస్తాడు. ప్రేక్షకులు ఆనందించారా? ప్రాశ్నికుడు సంతృప్తి పొందాడా? ఆ పద్యం కాలాంతరంలో నిలబడుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం కాలమే నిర్ణయించాలి. అందుకే ప్రాశ్నికులు కూడా రసజ్ఞులుగా ఉండాలి. అలాంటి వారు లభించడం అవధాని అదృష్టం.

కర్నూలు అవధానంలో నరాలవారికి **"గర్భదరిద్రుడేలును సుఖంబుగ ధారుణిచక్రమంతయున్"** అని సమస్యనిచ్చారు. ఇందులో గర్భదరిద్రుడు భూమండలాన్ని సుఖంగా పరిపాలించ గలడన్న విరుద్ధార్థంతో పాటు దుష్కరప్రాస కూడా ఉన్నది. అర్భకుడైన అవధాని ప్రాస దగ్గరే డీలా పడిపోతాడు. కానీ అవధానకంఠీరవప్రథితులైన నరాలవారి పూరణ నల్లేరుపై బండి నడకలా సాగింది.

దుర్భరవేదనావిధురదుస్సహసంసృతి వీడివచ్చి, రో
చిర్భరవిష్ణుపాదసరసీరుహసేవన మాచరింప నే
యర్భకుడైన పొందగల దద్భుతశక్తులు; శ్రీవిలాసియై
గర్భదరిద్రు డేలును సుఖంబుగ ధారుణిచక్రమంతయున్

ఇందులో 'రోచిర్భర' పదకల్పన అనన్యసామాన్యం. గర్భ దరిద్రుడు శ్రీవిలాసియైతే ధారుణిచక్రాన్ని పాలిస్తాడు. శ్రీవిలాసి కావడానికి విష్ణుపాదసరసీరుహసేవనం చేయాలన్న ప్రబోధం ఇందులో ఉంది. దుర్భరవేదనకు ఆలవాలమైన సంసారాన్ని వీడి విష్ణుని సమాశ్రయించాలి. ఈ పద్యంలోని సమాసఘటన నిరర్గళంగా సాగింది. దుష్కరప్రాసతో పాటు విరుద్ధార్థం కూడా పరిష్కారమైపోయింది.

మరొక సందర్భంలో కర్నూలులోనే ఇచ్చిన మరో దుష్కరప్రాస సమస్య ఇలా ఉన్నది – **"నిస్త్రింశంబున కోయబూనితివహో! నీరేజపత్రంబులన్"**. శ్రీ నరాల రామారెడ్డి గారి పూరణాధోరణి చూద్దాం –

శస్త్రంబుల్ ఝుళిపించి భీకరరణక్ష్మాసీమలన్ నిల్చిరా
యస్త్రంబుల్ గ్రహియించి క్రుద్ధమతులై యావేశముం జూపిరా
నిస్త్రాసాత్ములు సుప్తబాలురపయిన్ నీకింత విద్వేషమా
నిస్త్రింశంబున కోయబూనితివహో! నీరేజపత్రంబులన్.

పూరణ వినగానే పోతన గుర్తుకు వస్తాడు. **'ఉద్రేకంబున రామశస్త్రధరులై...'** అన్న పద్యంలోని భావన ఛందఃపరివర్తన కూడా లేకుండా ప్రాసభేదంతో చెప్పబడినట్లు ఉన్నది. సమస్య మంచి ఆలంకారిక అభివ్యక్తిగా మారిపోయింది. కావ్యాంతర్గత పద్యమునకు సమస్కంధంగా నిలిచింది. ఇది నరాలవారి ప్రతిభకు గీటురాయి.

ఒక్కోసారి అవధానంలో పాత సమస్యలే ఇస్తుంటారు. అప్పుడు పూర్వులు పూరించిన పద్ధతి, భావం, ఎత్తుగడ మొదలగువాటి ప్రభావం తనపై పడకుండా అవధాని జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

దృఢసత్వంబున చీమ తుమ్మెగదరా! దిగ్దంతులల్లాడగన్
అంధుండర్ధనిశీధమందు గనె నయ్యర్కేందుబింబమ్ములన్
ఉష్ణీషంబున గట్టవచ్చునె మదవ్యాఘోగ్రశుండాలమున్
ముగ్ధ నహల్య గాంచి మది మోహము జెందెను రామచంద్రుడే
కుక్కలు పచ్చిగడ్డి తినె గోవులు మ్రింగెను పిల్లిమాంసమున్
మదగజయానకున్ రవిక మాత్రమె చాలును చీర యేటికిన్
హనుమత్పుత్రుడు భీష్మపుత్రిని వివాహంబాడె దీవింపుడీ
బాంబులు మానవాళికిని ప్రాణము నిల్పును సౌఖ్యమిచ్చెడున్
దున్నకు దూడ పుట్టినది దుగ్ధము పిండగ కుండ తేగదే
నానీపత్నికి కోర్కె తీర్చుమనె హన్మంతుండు కౌంతేయుతోన్
పగలే సంస్కృతి మూలహేతువులు సౌభాగ్యమ్ము చేకూర్పగన్.

పైవన్నీ పాత సమస్యలే. పృచ్ఛకులు కష్టపడకుండా అవధానిని కష్టపెట్టాలని అనుకున్నప్పుడు ఏదో ఒకటి 'ప్రాతదే కానీ మీరు క్రొత్తగా పూరిస్తారని' అంటూ సన్నాయి నొక్కులు నొక్కి ఊరుకుంటారు. ఇలాంటి సందర్భాలలో అవధాని వైలక్షణ్యం బయట పడుతుంది. ఆలోచనావిస్తృతి తెలుస్తుంది. శ్రీ రామారెడ్డి గారు వైవిధ్యంగా ఇలాంటి సమస్యలు పూరిస్తూనే తమ ముద్రయైన సరససత్కవిత్వాంశను చిక్కగా చక్కగా చొప్పించారు. స్థాలీపులాకన్యాయంగా ఒక్క సమస్యాపూరణను పరికిద్దాం –

(సశేషం)

మంథనీ పద్యసాధన బృందముల ఆధ్వర్యవంలో
చి. వింజమూరి సంకీర్త్య శర్మ
జూమ్ - యూట్యూబ్ అష్టావధానం
12.06.2026

అధ్యక్షులు: కొల్లారపు ప్రకాశరావు శర్మ,
వ్యవస్థాపకులు, మంథనీ పద్యసాధన బృందములు
సంచాలకులు: నేమాని ప్రసాద్

ప్రార్థనా పద్యాలు

మ.కో. శ్రీవినాయక సిద్ధి దాయక చిత్తమందున నిల్పియున్
దేవవందిత సద్విభాసిత తీక్ష్ణదంత సుధామయా
త్రోవ జూపుచు గావు మమ్ముల తోయజాక్ష గజాననా
సేవలంబ్రణుతించిజేసెద చింతలేక గణాధిపా

చ. కరమునబట్టి పుస్తకము; కచ్ఛపిమీటుచు దివ్యవాణివై
సురుచిర రూపమందునను శోభలుగూర్చెదు హంసవాహినీ
నిరతము భక్తితోడ నిను నేను భజించెద వాగ్వధూటి నీ
కరుణను జూపుమాయిలను కామితదాయిని దేవి శారదా!

సీ. అవధానముల తోడనాలయంబుల వృద్ధి
శతశతకములచే శాస్త్రవేద
ధారుణిఁబచ్చగ తరువులతో జేయ
పారాయణల జేత భక్తిఁనాట
పద్యపక్షములచే పద్యార్చనల జేసి
నవతరాలకు బంచ కవితలిలను
భారతీ కృపతోడ భవ్య కాంతులఁ జిమ్మ
తటవర్తి గురుకుల ధరణుఁడొాచు

తే.గీ. దివ్య రీతిని పెంచగ తెలుగుభాష
వివిధ దేశములందున వీనులలర;
భవ్య సద్వధానార్చన భారతీశ!
గురువరేణ్య! కల్యాణాఖ్య! గొల్తుమిమ్ము

మ.కో. పద్యసంపద సంతసమ్ముగ పంచిపెట్టగ పెద్దలే
వేద్య రూపి సరస్వతీ సతి వెల్గుచుండగ నద్దరిన్
విద్యతో వినయంబు నేర్పెను వేడ్కగా పరిషత్తుయే
సద్యశస్సును మాకుగూర్చిన సద్గురావళి సన్నుతుల్

ఉ. పద్యము శిష్యసంతతికి భవ్యమహద్గతి నేర్పుచున్ సదా
విద్యను దేశదేశముల వేడ్కగ బంచుచు వెల్గులీనగన్
హృద్యవచోవిలాసమయ హేరవధానము నిర్వహించగన్
వేద్యమునందజేయుచును పేర్మిని గొల్తు ప్రకాశవర్యులన్

ఉ. అందరు పద్యపాఠకులు నందరు సత్కవనామణుల్ గదా
యందరు శాస్త్రపాండితులు నందరు సత్యసుకీర్తివంతులే
చందన సద్వధానమున శక్తినొసంగెడు దాతలే గదా
అందిలచేతు వందనము లందరికిట్లు వహింపుడస్త్రముల్

నిషిద్ధాక్షరి: **మాస్టర్ వరుణ్ ఆదిత్య,** Austin, TX USA
అంశం: **సుందరకాండము.**

(హ) శ్రీ(ల)మ(త)యు (స)మౌ(గ) ధీ(శ)ద(స)ంబై
(వ)ధామ(స)ము (భ)ని(న)డి (ర)తా(బ)ను కు(శ)జ(మ)కు
ధా(ర) టి(న)గ (మ)ని(ర)ల్పన్

కం. శ్రీమయమౌ ధీదంబై
ధామము నిడి తాను కుజకు ధాటిగ నిల్పన్
రామునికి తెలుప హనుమయె
క్షేమంబను వార్త దాటె శ్రీయుత జలధిన్

సమస్య: **కుమారి సత్య యశస్విని వేదుల,** Detroit, MI, USA
"పులియె మనకు మంచి ఇరుగు పొరుగు నిజము"

తే.గీ. వనము నందున విహరించు భవ్య జీవి
తనను బంధించి హింసించి తనరు కంటె
మనిషి యగు వాడు కల్పించ మంచి గృహము
పులియె మనకు మంచి యిరుగు పొరుగు నిజము

దత్తపది: **కుమారి శ్రేష్ఠ విష్ణుభొట్ల,** Herndon, VA, USA
రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న - పదాలతో మహాశివస్తుతి

తే.గీ. శంకరా మహా దేవ నిన్ సంస్తుతించి
అసుర శత్రుఘ్న యన్చు నిన్నభినుతించి
మమ్ము లక్ష్మణులను జేయ మహిమ తోడ
భరతుడవగుము నీ విట భవ్య రూప

వర్ణన: **కుమారి ఇంద్రాక్షి అయ్యలసోమయాజుల,** Ashburn, VA, USA
"అడవిలో ఎగురుతున్న పక్షి ఒక పండును చూసి ఏమనుకుంటుంది? ఏమి చేసింది?"

తే.గీ. చూచితిని యహా! నేనొక చూత ఫలము
వెదలి యొక పట్టు పట్టెద వేడ్క గలుగ
యనుచు చిలుక యొకటి వేగ యాకసమును
వీడి చేరెను చెట్టును విందు గొనగ

న్యస్తాక్షరి: **మాస్టర్ సుబ్రహ్మణ్య జితామిత్ర వేదుల,** Detroit, MI, USA
1వ పా.4 వ అక్షరము - 'కి'; 2వ పా.8వ అక్షరము - 'జ్ఞ'; 3వ పా. 6వ అక్షరము - 'ల్ప'; 4వ పా. 4వ అక్షరము - 'తే'

తే.గీ. విద్య నా(కి)డి గురువులై వేడ్క తోడ
సకల వేద కావ్య(జ్ఞ)! మీ చరణములను

విడిచి సత్క(ల్ప) వృక్షమున్ విడువ దగునె
కాన నే (తే)టగీతి లో ఘనము గొలుతు

ఆశువు: మాస్టర్ జస్విత్ బోరా, Velgatur, TS, India

(1) నదీ ప్రవాహము

ఆ.వె. కొండ నుండి పారి కోర్కెలు దీర్చగా
పంట పైరులకును పంచి నీరు
గల గల యని యురుకు జలపాతమై భువి
కాన నదియె మనకు ప్రాణ మగును

(2) తొలకరి వాన మట్టి వాసన

ఆ.వె. వాన వ్రేలు గాగ వీణయే నేల యౌ
పలుక స్వరముల నిక పటపట యని
మట్టి వాసన యది మనము రంజిల్లగా
జేయుగాన జూడ చింత దీరు

చిత్రానికి పద్యము: మిస్టర్ వేదవ్యాస్ విష్ణుభొట్ల, Warangal,

(1) శివ తాండవము

ఆ.వె. తరికిట తకధిమిత తక్కిట తజ్ఝణు
తకతరిగిణత యను తాళమందు
సకల జగము మెచ్చ సతి తోడ నాడగా
తాండవమును శివుని తలచి కొలుతు

(2) మాతృత్వము

ఆ.వె అడుగు వేయ నేర్పి యనురాగమున్ జూపి
చేతిని వదలకయె చెంత నుండి
తొలి గురువయి తాను తొలి నేస్తమై సదా
తల్లియే మన తొలి దైవమగును

(3) పున్నమ రాత్రి అందము

ఆ.వె. షోడశ కళల నిట సొంపుగా గలుగుచు
చల్లగా మెరియుచు సంతసమును
పంచి సతము నీవు పౌర్ణమి నాడున
వెలుగు చందమామ! వెతలు దీర్చ

(4) సెల్ ఫోను

ఆ.వె. పొదుము డబ్బు వంటి పొట్టి సెల్ఫోనిదే
పట్టినంత మనకు పట్టు పిచ్చి
వదిలినంత వదులు వదిలింప కష్టమే
వదులు మయ్య మనుజ! కదులు మయ్య!

అప్రస్తుతప్రసంగం: కుమారి సుబ్రమణ్య మిహిర వేదుల, USA

(చిత్రాలు, మరిన్ని వివరాలు 25వపేజీ మరియు చివరి అట్టలోపలిపుటలో...)

ఆంధ్రి కుటీరం, పల్లిపాలెం, ఆంధ్ర ప్రదేశ్ వేదికగా చి. నరసింహదేవర జయలక్ష్మి సంస్కృత అష్టావధానం

సంచాలకులు: అవధానప్రాచార్య ధూళిపాళ మహాదేవమణి

అధ్యక్షులు: మధునాపంతుల సత్యనారాయణమూర్తి

విశిష్టఅతిథి: మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి

నిషిద్ధాక్షరి: మునుకుట్ల సూర్యనారాయణమూర్తి

భవ్యాం శ్రీశాం హితాం రమ్యాం అంబామీడే సదా సఖే ।
గౌతమీం గౌతమర్షిద్యాం మాయాగోప్రాణదాయినీంవ ॥

సమస్య: ఓలేటి బంగారేశ్వర శర్మ

సత్యవాక్యమహో నరేణ న శక్యతే గదితుం భువి

ధర్మజో నను సత్యవాక్యరతోప్యథాహవరంగకే
ఉక్తవాననృతం నృపో జగదీశ్వరస్య వరాజ్ఞయా ।
ప్రాణమానధనాదిభీతిషు పంకజోపమ లోచన
సత్యవాక్యమహో నరేణ న శక్యతే గదితుం భువివ ॥

దత్తపది: కొరుప్రోలు గౌరీనాయుడు

తు, చ, హి, వై – ఈ అక్షరాలని అర్థవంతమైన పదాలలో వాడుతూ దైవప్రార్థన – స్వేచ్ఛావృత్తంలో

దంతీంద్రవక్త్రస్యతు మాతులస్త్వం
హే వైనతేయాగ్రగ కంజనేత్ర ।
హే పంఢరీవాస సదా హితస్త్వం
వందే విభో తే చరణౌహ్యుపేంద్రవ ॥

న్యస్తాక్షరి: ఎన్. వీరేశ్వరి

1 –1–మా; 2–2–గ్గ; 3–3–శీ; 4–4–ర్చ

సుబ్రహ్మణ్యస్వామి వర్ణన

మామవాయి దయాసింధో
భర్గసూనో భవార్తిహన్ ।
సద్వశీ సన్నుతాంగోసి
వందితార్చకృతైః స్తవైఃవ ॥

వర్ణన: కాకరపర్తి దుర్గాప్రసాద్

కాశీకి పల్లెపాలెమునకు సారూప్యత

హే విశ్వనాథ ను భవాన్ భవసర్వగోసి
హే వ్యాససన్నుతవిభోఽత్ర విరాజసే త్వం ।
గంగాధరాథ వరగౌతమ సన్నుతాయాః
నీరార్ద్రదేహ జయసేఽథ దయార్ద్రచిత్తవ ॥

ఆశువు: పోచినపెద్ది సుబ్రహ్మణ్యం

1. సత్యనారాయణాజ్ఞాతం సత్యదేవేన పాలితం ।
   సత్యమాంధ్రీకుటీరంయత్ భాసతే జగదీశ్వరవ ॥
2. శక్తిస్త్వం నారసింహస్య
   పద్మే పద్మాలయే పరే ।

(మిగతా 22వ పేజీలో)

యతిప్రాసవివేచనము - 2

- చిటితోటి విజయకుమార్

స్వరయతులు

ఈ వ్యాసంలో అచ్ సంధులు (స్వరసంధులు) స్వరయతులపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసుకొందాం. ఈ దిగువ పేర్కొన్న అచ్చులకు పరస్పరం యతిమైత్రి చెల్లుతుంది. దీనినే "స్వరమైత్రి" అంటారు.

1. అ - ఆ - ఐ - ఔ
2. ఇ - ఈ - ఋ - ౠ - ఎ - ఏ
3. ఉ - ఊ - ఒ - ఓ

హల్లులకు యతి అమర్చేటప్పుడు కూడా ఈ స్వరమైత్రిని తప్పక పాటించాలి. స్వరమైత్రి కలిగిన యతులను "స్వరమైత్రి యతులు" లేదా "స్వరయతులు" అంటారు. రెండు అచ్చుల మధ్య జరిగే సంధిని 'స్వరసంధి' లేదా 'అచ్-సంధి' అంటారు. స్వరసంధులు ప్రధానంగా రెండు పదాల మధ్య జరుగుతాయి. సంధిలోని మొదటి పదాన్ని 'పూర్వపదమని', రెండవ పదాన్ని 'పరపదమని' అంటారు. చాలా యతులు ఈ సంధుల రూపాలపైనే ఆధారపడి ఉన్నందున, మొదటగా సంధులకు సంబంధించిన కొన్ని ప్రాథమిక విషయాలను తెలుసుకొందాం.

సంస్కృత సంధులలో కానీ, తెలుగు సంధులలో కానీ - కొన్ని అపదాంత సంధులలో సైతం అచ్చులు పూర్వంగా లేదా పరంగా వచ్చినప్పుడు జరిగే సంధిప్రక్రియ (దీనినే "అంగకార్యము" అంటారు) యతులపై స్పష్టమైన ప్రభావం చూపిస్తుంది. వాటిని కూడా ఈ విభాగంలో పరిశీలిద్దాం.

తత్సమ పదాల మధ్య జరిగే సంధులు సంస్కృత వ్యాకరణ నియమాలను పాటిస్తాయి. మిగతా తెలుగు పదాల మధ్య జరిగే సంధులు బాల-ప్రౌఢ వ్యాకరణ నియమాలను పాటిస్తాయి. ముందుగా సంస్కృత సంధి విశేషాలను చూద్దాం. అచ్ సంధులలో ప్రధానంగా ఐదు భేదాలు ఉన్నాయి. అవి: **1. యణాదేశ సంధి 2. అయవాదేశ సంధి 3. గుణ సంధి 4. వృద్ధి సంధి 5. సవర్ణదీర్ఘ సంధి.** మిగిలిన అచ్ సంధులన్నీ దాదాపు ఈ సంధులకు అనుబంధంగానే ఉంటాయి. ఇవిగాక అవ-ఆదేశ సంధి, జశ్త్వ సంధి (హల్ సంధి), విసర్గ లేదా స్వాది సంధులలో కూడా అచ్చులు పరంగా రావచ్చు. వాటిని కూడా ఈ స్వరసంధుల చర్చలో భాగంగా తెలుసుకొందాం. అలాగే తెలుగు సంధులలో ఉత్వ, ఇత్వ, అత్వ సంధులు, యడాగమ, ఆమ్రేడిత, ద్విరుక్తటకార, టుగాగమ, రుగాగమ, నుగాగమ, విసర్గ, ద్విత్వ, వుగాగమ సంధి మొదలైనవాటిలో అచ్చులు పరంగా వస్తాయి. వీటి ప్రభావాన్ని కూడా ముందుముందు పరిశీలిద్దాం.

సంస్కృత సంధులలో ప్రధాన ప్రక్రియలు పూర్వపర అక్షరాల స్థానాలను నిశ్చయించడానికి సంస్కృత సంధులలోని కొన్ని ప్రధాన ప్రక్రియలను తెలుసుకోవడం అవసరం. అవి: **1. లోపము** (అష్టాధ్యాయి 6.1.66) **2. ఆగమము** (అష్టాధ్యాయి 6.1.73-76) **3. ఆదేశము:** 3.1 పూర్వవర్ణానికి ఆదేశము (అష్టాధ్యాయి 6.1.77-82) 3.2 పూర్వపరాలకు ఏకాదేశము (అష్టాధ్యాయి 6.1.84-111) 3.2.1 పూర్వపరభిన్న ఏకాదేశము (అష్టాధ్యాయి 6.1.87-93) 3.2.2 పరరూప ఏకాదేశము (అష్టాధ్యాయి 6.1.94-100) 3.2.3 పూర్వరూప ఏకాదేశము (అష్టాధ్యాయి 6.1.102-110) 3.3 పరవర్ణానికి ఆదేశము (అష్టాధ్యాయి 6.1.112-114).

వీటిని గురించి సంగ్రహంగా తెలుసుకొందాం:

లోపము: అచ్ సంధులలో సాధారణంగా అచ్-లోప ప్రసక్తి రాదు (తెలుగు అత్వ/ఇత్వ/ఉత్వ సంధులలో తప్ప). కనుక ప్రాచీన సంస్కృత నియమానుసారము అచ్-సంధులలో యతులపై లోప ప్రభావం ఉండదు.

ఆగమము: సంస్కృత అచ్-ఆగమాలలో అచ్చులు నేరుగా లేనందున, ఆగమాలకు యతులకు మధ్య ఉన్న సంబంధాన్ని "హల్సంధులు - యతులు" అనే భాగంలో చర్చిద్దాం. అయితే ట్, ఙుట్, నుట్ ఆగమాలపై అచ్చులు వచ్చినప్పుడు జరిగే ద్విత్వప్రక్రియపై యతుల ప్రభావం ఉంటుంది. ఉదాహరణకు సుగణ్ + ఈశః = సుగణ్ ణుట్ ఈశః = సుగణ్ణీశః అవుతుంది. కనుక పాదం మొదట్లో ఉన్న ఇ,ఈ, ఎ. ఏ. ఋ, ౠ లతో 'ణ్ణీ' లోని ఈకారానికి యతి చెల్లుతుంది.

ఆదేశము (1. పూర్వవర్ణానికి ఆదేశము: ఈ ఆదేశంలో పూర్వవర్ణం మారుతుంది కానీ పరవర్ణం మారదు)

అ) యణాదేశ సంధి: 'పూర్వవర్ణానికి ఆదేశం' అనే దానికి ముఖ్యమైన ఉదాహరణ యణాదేశసంధి. 'ఇ, ఉ, ఋ,' లతో కూడిన వర్ణాలకు (హ్రస్వాలైనా, దీర్ఘాలైనా) అసవర్ణమైన అచ్చులు పరమైతే వరుసగా 'య్, వ్, ర్, ల్' లు ఆదేశమవుతాయి (అష్టాధ్యాయి 6.1.77). ఇక్కడ పాదాది అక్షరానికీ,

యణాదేశంగా వచ్చిన య్, వ్, ర్, ల్ లతో కూడిన (పరంగా ఉన్న) అక్షరానికి యతి మైత్రి చెల్లుతుంది. ఉదాహరణలు:

'అద్భుతంబిది కణ్వ ము-న్యాశ్రమంబు' (కల్పితం) - 'అ'కారానికి, 'ముని + ఆశ్రమంబు = మున్యాశ్రమంబు' లోని 'ఆ'కారంతో కూడిన 'న్యా' కు (యణాదేశం వల్ల వచ్చిన యకార స్థానంలో) యతి చెల్లుతుంది.

'అతడు మదిలోన నిలిపె మ-ధ్వరిని హరిని' (కల్పితం) - 'అ'కారానికి, 'మధు + అరి = మధ్వరి' లోని 'అ'కారంతో కూడిన 'ధ్వ'కు యతి చెల్లుతుంది.

అతడు నెఱవేర్చె నేడు మా-త్రాశయమును' (కల్పితం) - 'అ'కారానికి, 'మాతృ + ఆశయము = మాత్రాశయము' లోని 'ఆ'కారంతో కూడిన 'త్రా'కు యతి చెల్లుతుంది.

ఆ) అయవాదేశ సంధి: 'పూర్వవర్ణానికి ఆదేశం' అనే సంధికార్యానికి మరో ఉదాహరణ అయవాదేశసంధి. అచ్చులు పరమైనప్పుడు పూర్వంలో ఉన్న 'ఏ, ఓ, ఐ, ఔ' లకు వరుసగా 'అయ్, అవ్, ఆయ్, ఆవ్' లు ఆదేశమవుతాయి. తెలుగు పద్య విరచనలో ఈ రకమైన సంధి పద రూపాలు నేరుగా వాడటం అరుదు (సంస్కృత సమ సమాసాల్లో తప్ప). కాబట్టి యతులపై అయవాదేశ సంధి ప్రభావం ప్రత్యేకంగా కనిపించదు.

పూర్వపరవర్ణాలకు ఏకాదేశంగా వచ్చే సంధులు స్వరప్రధాన యతులపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తరువాత వ్యాసంలో వివరంగా తెలుసుకొందాం.

శబ్దరత్నాకరం నిర్మాణం

శబ్దరత్నాకరం ప్రాచీన కవులను g,h,i ...తరగతులలో పేర్కొనడం జరిగింది. వీరి వర్గీకరణ ఎలా జరిగింది?

శబ్దరత్నాకరములో నిర్ణయింపబడిన గ్రంథకర్తల తరగతులన్నీ నిఘంటు నిర్మాణంలో ఆయా కవుల ప్రామాణికతాదృష్టితోనూ, ఆ కవుల పదాలు తమకు ఎంతవరకు అర్థనిర్ణయంలో ఉపకరించినదీ తెలియజేసేందుకు గాను చేయబడ్డాయి. సంస్కృతాంధ్ర నిఘంటువులు, నిఘంటువులకు వెలసిన వ్యాఖ్యలు స్వతఃప్రమాణం కలిగినవి కాబట్టి వాటికి f అన్న విలువ చూపబడింది. అవి సంఖ్యాగణన పరిధిలోకి రావన్నమాట. వాటిలోని శబ్దార్థాలను (ఎక్కడో అరుదుగా తప్పించి) ఉన్నవి ఉన్నట్లుగా గ్రహించారని అర్థం. అంతే గాక సీతారామాచార్యుల వారే చెప్పినట్లు ఆ పదకోశాలలో శైలిని గుర్తుపట్టడం సాధ్యం కాదు కనుక వాటికి సంఖ్యను ఇవ్వలేదు.

ఇక, భారత కవులు ముగ్గురికీ g సంఖ్యను ఇచ్చారు. ఏ పదానికైనా కవిత్రయప్రయోగం ఉంటే దానిని ముందుగా ప్రమాణీకరిస్తారు. కవిత్రయ ప్రయోగం అర్థనిర్ణయంలో సందేహం వస్తే మూలాన్ని సంప్రతించి, అర్థాన్ని నిర్ణయిస్తారు.

శ్రీనాథుడు, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు మొదలైన వారికి h సంఖ్యను ఇచ్చారు. వారి ప్రయోగాలు నిఘంటు నిర్మాణానికి అంతగా ఉపకరించాయని అర్థం. అట్లాగే తక్కినవన్నీ.

ఒక చిన్న వింత: ఆచార్యుల వారు చేమకూర వేంకటకవిని విజయవిలాస కావ్యరచన వల్ల నాలుగవ తరగతిలో (j) చేర్చవలసి ఉన్నప్పటికీ - సారంగధర చరిత్రము రచన కారణంగా అయిదవ తరగతిలో చేరుస్తున్నామని వ్రాశారు. అది కవిత్వాన్ని గురించిన సంగతి కాదు. తమ నిఘంటువుకు అందులోని పదాలు ఎంతవరకు ఉపకరించాయో చెప్పటం అన్నమాట.

నిఘంటువులో మొత్తం 104 కావ్యాలకు అయిదు తరగతులు ఉన్నాయి. శబ్దరత్నాకరం అచ్చయేనాటికి అనేక కావ్యాలకు సరైన పరిష్కరణలు, మంచి వ్యాఖ్యలు వెలువడలేదు. అందుకే అది ఆచార్యుల వారి పాతికేళ్ళ కృషికి గీటురాయిగా నిలిచిపోయింది.

ఆముక్తమాల్యదా వ్యాఖ్యలో ఆచార్యుల వారి పాఠశాలా శిష్యులైన శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి గారు, "మద్గురువులు ఆముక్తమాల్యదం గూర్చిన నిజకృషి నెల్ల తమ నిఘంటువులో నాఁటియున్నారు" అని ప్రశంసించారు.

కొన్ని కావ్యాల నుంచి ఆయా పదాల వద్ద ప్రయోగాలను ఉదాహరించినప్పటికీ - ఆచార్యుల వారు ఆ కావ్యాల పేర్లను, వాటి తరగతి సంఖ్యలను ఇవ్వటం మర్చిపోయారు. అవి ఒక ఇరవై దాకా ఉన్నాయి. ఉదాహరణకు లిఱచ్చాళులి అన్న పదం వద్ద చూడండి. ఆ పతివ్రతా మాహాత్మ్యము అన్న కావ్యాన్ని పట్టికలో చేర్చటం మర్చిపోయారు. దానికి సంఖ్యను ఇవ్వలేదు.

ఎంతవారికైనా పొరపాట్లు తప్పవు కదా. ప్రమాదో ధీమతామపి అని ఉండనే ఉన్నది. జాణలు జారుపాటులను గణింపరని అనుకొన్నదే కదా.

అంతటి కఠిన నియమజాతంతో నిర్మితమైనది కనుకనే శబ్దరత్నాకరానికి లోకంలో అంతటి ప్రామాణికత, ప్రాచుర్యం లభించాయి.

అన్నట్లు, సంస్కృతంలో వామన భట్టబాణుడు నిర్మించిన బృహన్నిఘంటువు పేరు కూడా శబ్దరత్నాకరమే. ఈ రెండూ మనకు ప్రామాణికములే.

- ఆచార్య ఏల్చూరి మురళీధరరావు

పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

"బావా రమ్మని పిల్చె స్నేహమెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్"

సర్వాజోస్యుల గౌరీ శంకర శాస్త్రి, తగరపువలస

ఈవేళన్నిటులూరువుల్ విరిగె వీనిం జూడు దుర్యోధనున్
నావారందరు గెల్తురంచు భ్రమసెన్ నైజంబుచే కేశవా!
బావా రమ్మని పిల్చె స్నేహమెసగన్ బార్థుండు దుశ్శాసనున్
మావాడైన వృకోదరుండు గదతో మర్దించె యుద్ధావనిన్.

వేదాల గాయత్రీదేవి, హైదరాబాదు

నీవే యుద్ధపు భీతిమానుమికపై నిర్భీతిగా పోరుమన్
త్రోవల్ సూపుచు ధైర్యవాక్కు పలుకన్ తోషంబుతో సిద్ధమై
బావా రమ్మని పిల్చె స్నేహమెసగన్ బార్థుండు, దుశ్శాసనున్
పోవం గూల్చిరి పాండవేయులనిలో పూర్ణత్వమేపారగా.

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

భావం బెంచి సుభద్రతోఁ బనుపగన్ పార్థున్, ధృతిన్ శౌరి గాం
డీవంబందుచు సాగి, యల్క హలియున్ దీవిన్ బ్రదర్శింపఁ దాఁ
జేవంగల్గియు పంతమున్ దెలిసి నిశ్శేషంబొనర్పన్ బగన్
బావా! రమ్మని పిల్చె స్నేహమెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్!

ఆకుల శాంతి భూషణ్, వనపర్తి

ఆ వైకుంఠనివాసి దానవుల సంహారించు చక్రాయుధున్
శ్రీవత్సున్ సురవందితుండు హరినిన్ శ్రీకృష్ణునిన్ గాంచుచున్
బావా రమ్మని పిల్చె స్నేహ మెసగన్ బార్థుండు.., దుశ్శాసనున్
చేవన్ జూపుచు రొమ్ము జీల్చెను గురుక్షేత్రమ్మునన్ భీముడే.

పి.యల్.నాగేశ్వరరావు, హైదరాబాదు

నీవే దైవము! తోడు నిల్వ ననిలో నిక్కంబుఁ బోరాడి, నేఁ
జేవన్ జూపుచు నుక్కడింతుఁ నరులన్ శీఘ్రమ్మునన్ మాధవా!
బావా! రమ్మని పిల్చె స్నేహ మెసగన్ బార్థుండు, దుశ్శాసనున్
జావన్ గొట్టుచు భీముడత్తటి నృపుం జంపంగ నుద్రేకియై!

అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు

చేవన్ జూపుచు కౌరవాధములపై జీవమ్ములన్ దీయగా
నావిద్వేషి సమూహముల్ బెదర నాద్యంతమ్ము, శ్రీకృష్ణునిన్
బావా రమ్మని పిల్చె స్నేహమెసగన్ బార్థుండు, దుశ్శాసనున్
భావావేశముతో వృకోదరుడు తా పల్లార్చ వీక్షింపగా.

ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు

సేవాతత్పరుడై హరిం గనుచు తా స్నేహంపు సౌహార్దుడై
బావా రమ్మని బిల్చె స్నేహమెసగన్ బార్థుండు, దుశ్శాసనున్
పోపోయీ యనుచున్ కరంబు నలుకన్ ప్రోలన్లనంగక్కటా
తావుస్గోరగ కౌరవప్రముఖుడే దండెత్తికొంతేయులే!

పాతూరి సుబ్రహ్మణ్య కవి, తెనాలి

లేవా మీ శతసోదరాళిఁ బరిశీలింపంగ; సౌహార్దమున్
నీవొక్కండవె భిన్న భావములతో, నీయగ్రజార్థంబుగా
నూవాడంగ; రణంబు తథ్యమది; నీవోర్వంగ లేవింక నో
బావా రమ్మని పిల్చె స్నేహమెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్!

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

ఏవో యూహలఁ దేలి, పాండవులు తామెంతో కనన్, గౌరవుల్
భావించంగ వనమ్ముఁ జేరిన తఱిన్ బంధించ గంధర్వుఁడే
యా విజ్ఞాని యుధిష్ఠరుండు దయతో నంపంగ రక్షించుచున్
బావా రమ్మని పిల్చె స్నేహమెసఁగన్ బార్థుండు దుశ్శాసనున్.

విద్వాన్ భైరవనేని పోతురాజు చౌదరి, హైదరాబాదు

చేవం గూర్చెడు కృష్ణమైత్రి కనుచున్ శీఘ్రంబు సేవింపగా
బావా రమ్మని పిల్చెస్నేహ మెసగన్ బార్థుండు, దుశ్శాసనున్
ద్రోవం బోవగ జూచి నవ్వుచు, హరిన్ తోరమ్ము పూజించె తా
భావింపంగ పరాత్పరున్ హృదయ సంప్రాప్యంపు సైదోడుగా.

దత్తపది

"గో, రన్, కమ్, వాక్" ఈ పదాలతో పదాలతో ఉత్పలమాలలో పల్లె సౌందర్యాన్ని వర్ణించండి.

డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాదు

'గో'పద ధూళితో నెపుడు గోచరమౌ భువి పల్లె లంద'రన్'
ప్రాపుగ రక్షసేయ గన, వర్ధిలు 'కమ్మ'ని పాడిపంటలా
రూపములన్ కనంగ మదిలోన జనించెడు భావసంపదన్
దాపుల చెప్ప నెంచిన ముదమ్మగు 'వాక్రు'తిభార్థ సంపదన్.

సమస్య: లాస్యంబున్ బొనరించె మాధవుఁడు గైలాసాద్రిపై రంభతో

దత్తపది: ""జలము – వారి – నీరు – సలిలము' పదాలతో దావానలాన్ని వర్ణిస్తూ స్వేచ్ఛాఛందంలో పద్యం వ్రాయండి.

(పూరణలు 15 సెప్టెంబరు 2026 లోపు 7702121376 ఫోన్ నంబరుకు పంపాలి)

గట్టెడి విశ్వంత్, హైదరాబాద్.

కుంచియ బట్టి గీసెనది'గో' యన పచ్చని చేలు చీరగా
మించెను పల్లె కాంతకు; సమీప సరిత్తమ'రన్' శిఖాభమై
వంచనబుద్ధి లేని ప్రజ వర్తనయే తిల'కమ్మ'నంగ, మో
మంచిత కీర్తియయ్యె, గను డాయమ 'వాక్కు'లకంద జాలునే?

పాతూరి సుబ్రహ్మణ్య కవి, తెనాలి

కోవెల యేటి యొద్దన నిగూఢమ'గో'చరమైన దెందముల్;
లేవను మాట లేశమును లేని, పు'రన్ధ్ర'లు పాడిపంటలున్;
మావి గుబుర్లు 'కమ్మ'గ సుమంబుల వాసన లింపుగొల్పు పూ
తీవెలు; పల్లెయందలరు దీర్ఘిక; 'వాక్కు'నc దెల్ప శక్యమే!

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

'గో'వుల క్షీర సంపదలc గోవెల గంటల శ్రావ్య మాధురిన్
భావన యొప్పు 'వాక్కు'లకుc బాడుచు నాడుచుc గూర్చు పంటలన్
జీవన రేఖయై వరలి శ్రేయ నిధానగc బ్రాప'కమ్ము'గన్
బావనమై ధ'రన్' వెలుcగు పల్లెల భాసముc దెల్ప శక్యమే?

గర్భకవిత్వంలో చిత్రకవిత్వం

- వైద్యం వేంకటేశ్వరాచార్యులు

సీసపద్య గర్భిత చక్రవాళ చంపకమాల

సీ. పువులును గల్గు పుప్పొడులు పూవురసంబు
లు(ను) వాడువాడుకన్ (బొనుపుగనునె)
మివులదికేమి మేల్మియును మించునొ వేరు
గ(ను)నాడు నాడులన్ (మునుమునుమని)
తవులదు నీదు నందమును దావనియంద
ము(ను)గూడుగూడులన్ (గొనముగనునె)
కవలును నీ యొడల్ గనిన గౌరవమేము
గ(న) వాడవాడరా (కమలనయన)

తే. రసములనుగాంచు నీయనురాగమేమొ
తావులను గూర్చు నీదు సంధానమేమొ
భావములమించు నీ పరిపాటి యేమొ
సిరుల నిడుము వేదాద్రి లక్ష్మీనృసింహా! 1

గర్భిత చక్రవాళకందము

చ. పువులును గల్గు పుప్పొడులు పూవురసంబులువాడువాడుకన్
మివులదికేమి మేల్మియును మించునొ వేరుగ నాడు నాడులన్
తవులదు నీదు నందమును దావనియందము గూడు గూడులన్
కలువలు నీ యొడల్ గనిన గౌరవమేముగ వాడవాడరా

సీసపద్య గర్భిత అనులోమ విలోమ చిత్ర కందములు

సీ. మానుకొన వెరవె మనునర మానుర
మనువేర మనుమను నసన వినుమ
మానుగను సరస మదివిర మానుర
మనసాను మునుమమను ననుననుమ
మానునను ననుమ మనుమును సానమ
రనుమార విదిమస రసను గనుమ
మానువిన ననమ మనుమరవేనువు
రనుమా రననుమ వెరవెనకొనుమ

తే. చిత్రములయందు ననులోమ చిత్ర మెచ్చు
జీవకళనింపును విలోమ చిత్ర మెన్న
నన్నియో కొన్నియో చిత్ర హారము లివి
సిరులనిడుము వేదాద్రి లక్ష్మీనృసింహా! 2

గర్భిత అనులోమచిత్రకందము

క. మానుకొన వెరవె మను నర
మానుర మనువేర మనుమ మనసన వినుమా
మానుగను సరస మదివిర
మానుర మనసామ మునుమ మనునను ననుమా!

(పై కందపద్యమును నాలుగవ పాదము చివరి అక్షరము నుండి ప్రథమపాదము మొదటి అక్షరము వరకు చదివితే విలోమ చిత్రకందము)

విలోమ చిత్ర కందము

క. మానునను ననుమ మనుమును
సానమరను మారవిది మసరసను గనుమా
మాను విన ననమ మనుమర
వేనుమరను మారననుమ వెరవెన కొనుమా!

కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

క్లిష్టం

పదార్థదోషాలలో చివరిది **క్లిష్టం. 'వ్యవహితార్థప్రత్యయం క్లిష్టమ్'** అని వామనుడు క్లిష్టానికి ఇచ్చిన లక్షణం. అర్థావగతిలో ఆలస్యం జరుగుతుంటే అది క్లిష్టం అనే దోషం. అర్థప్రతీతిలో ఆలస్యం ఏ కావ్యంలోనైనా, ఏ పద్యంలోనైనా ఉండవచ్చును గదా! పాఠకుడి పద పదార్థజ్ఞానం తక్కువగా

ఉన్నప్పుడు ఏ పద్యమైనా క్లిష్టమే గదా అని సంశయించవచ్చు. నిజమే! రచయిత స్థాయికీ, పాఠకుడి స్థాయికీ మధ్య అంతరం ఎక్కువైతే, అప్పుడు అర్థప్రతీతి ఆలస్యమైతే అది క్లిష్ట దోషం కాదు. అది పాఠకుడి పరిజ్ఞాన లోపం మాత్రమే. పద్యంలో కానీ, వాక్యంలో కానీ, పదాల పరస్పర సంబంధాన్ని నిర్ణయించగల కారక పరిజ్ఞానం పాఠకుడికి అవసరమైన తొలి పాండిత్యం. అది లోపిస్తే అర్థ ప్రతీతిలో ఆలస్యం తప్పదు. అన్వయించగల శక్తి కలిగిన పిమ్మట ఏదైనా పదానికి అర్థం తెలియకపోవటం పాండిత్యలోపం కాదు, మరీ ప్రాథమిక పదాలయితే తప్ప. మరి అర్థప్రతీతిలోని లోపం క్లిష్టదోషమెలా అవుతుంది? అంటే ఈ దోషం పదాల కూర్పునకు సంబంధించినది. ఒక పదార్థాన్ని చెప్పటానికి దానికి అనుకూల ప్రతికూల పదాలను వరుసగా పేర్చుతూ, చివరికి వివక్షిత పదార్థానికి తీసుకొని వచ్చే ఒక పదవిన్యాసమిది. రసవత్కావ్యాలలో ఇటువంటి విన్యాసాలకు చోటు లేదు కాబట్టి ఇటువంటి ప్రయత్నం దోషంగా భావించబడింది. దాని పేరు క్లిష్టం.

ఇంతకుముందు నేయార్థమన్న దోషాన్ని గురించి చదివాం. అది కల్పితార్థరూపం. పదాలకు స్వతహాగా లేని అర్థాలను కల్పించటం నేయార్థం. కాబట్టి అది ఆ విధంగా దోషం. క్లిష్ట దోషంలో పదార్థకల్పనరూపమైన విన్యాసముండదు. పదాలన్నీ కూడా స్వస్వప్రసిద్ధార్థాలలోనే ప్రయోగింపబడి వుంటాయి. అయినా వెంటనే అర్థప్రతీతి కలుగదు. పదాలలో స్ఫోటధ్వని లాగా, వాక్యాలలో స్ఫోటధ్వని అవసరమైనవిధంగా ఇక్కడ పదాల కూర్పుండటం కారణం. అందువల్లనే అది క్లిష్టరూపమైన దోషం.

ఉదా:

అతివ మొలనూలితావు కార్శ్యమును బొందె
నైన నది కాదు దోషమం చనిరి బుధులు

ఇక్కడ నడుము అన్న ఏకపదానికి బదులు 'మొలనూలితావు' అని ప్రయోగించటం అర్థప్రతీతిలోని వేగాన్ని భంగపరుస్తుంది. తెనాలి రామకృష్ణుడు ప్రయోగించిన తిలకాష్ఠమహిషబంధం అటువంటిదే. పనిగట్టుకొని చేసిన పదబంధప్రయోగం కాబట్టి అర్థం కాకపోవటమన్న వివక్షిత ప్రయోజనాన్నీ అది అందించగలిగింది.

కావ్యప్రకాశంలో వ్యవహితార్థప్రతిపత్తినే క్లిష్టతకు లక్షణమన్నాడు మమ్మటుడు.

ఉదా:

అత్రిలోచనసంజాత మైనయట్టి
కాంతిచే నుద్గమించు లతాంత మట్లు
నీదు చెయ్దము భాసించు నృపవరేణ్య!

ఇక్కడ కలువపూవు అని చెప్పవలసిన తావున "అత్రిలోచన సంజాతకాంత్యుద్గమము" అని చెప్పటం (పద్యంలో వ్యస్తంగా వుంది. ఇక్కడ సమాసం చేశాం) క్లిష్టతకు కారణమవుతుంది.

సహజంగా అర్థప్రతీతి విలంబమన్నది ఏకపదంలో జరగదు. రెండు లేక ఎక్కువ పదాలు ప్రయోగింపబడినపుడు ఈ రెండు దోషాలు (అశ్లీలం, క్లిష్టం).. ప్రత్యేకించి క్లిష్టం ఏర్పడుతుంది. ఒక సమస్తపదంలో కానీ, రెండు అంతకన్న ఎక్కువ వ్యస్త పదాలతో కానీ క్లిష్టత కలగటం గమనించియే వామనుడు క్లిష్టత వాక్యంలో కూడా ఏర్పడుతుందని చెప్పి, వాక్య నిర్మాణంలోని కొన్ని పరిస్థితులలో(పూర్వపదాంత్య వర్ణాన్నీ-ఉత్తరపదాది వర్ణాన్నీ కలిపినప్పుడు) అశ్లీలత కనిపించటాన్ని కూడా గమనించి, క్లిష్టతాశ్లీలతలు వాక్యంలో కూడా సంభవిస్తాయన్నాడు.

కావ్యాలంకార సంగ్రహ కర్త కూడా క్లిష్టాన్ని 'దూరార్థము' అనియే నిర్వచించి, సమాసగతంగానే ఉదాహరణాన్ని చూపించాడు –

ఉదా: ..... పవనాశనేంద్రధర మకుటాలం
కారమణి జనకవరపు
త్రీరమణకుమారరూపదీపితుఁడనఁగన్

(కావ్యాలంకార సంగ్రహం 4/17)

ఇక్కడ మన్మథుడు అన్న అర్థాన్ని చెప్పటానికి "పవనాశ.... కుమార" అని పెద్ద సమాసంతో ఎవరెవరినో గొలుసుకట్టుగా లాగి చెప్పవలసి వచ్చింది. పవన+అశన+ఇంద్ర-ధర= గాలిమేసే(పాముల) తేని ధరించిన శివుడు; ఆయన మకుట+ అలంకార-వర-మణి=చంద్రుడు; ఆయనకు జనకుడు

సముద్రుడు, ఆయన పుత్రి లక్ష్మి, ఆమె రమణుడు విష్ణువు, ఆయన కొడుకు మదనుడు..... ఇంతలా డొంక తిరుగుడు వ్యవహారాలను క్లిష్టమంటారు. ఇది సమస్తపదంతో నిర్వహింపబడింది కాబట్టి పదార్థదోషమే. ఎఱ్ఱతామరను 'క్షతజకంజేక్షణలు' సమస్తపదంలో క్షతజకంజం అనటం ఇటువంటి సమస్తపదమే (కావ్యాలంకార చూడామణి 6/84).

ఈ దోషాన్ని వాక్యరూపంలో ప్రదర్శిస్తే ఈ క్రింది పద్యాలలా ఉంటుంది.

పర్వత శ్రేష్ఠపుత్రికాపతి విరోధి
యన్న పెండ్లాము అత్తను గన్నతల్లి
పేర్మిమీఱఁగఁ బుట్టిన పెద్దబిడ్డ
సున్నమించుక తేగదే సుందరాంగి!

శతపత్రంబుల మిత్రుని
సుతుజంపినవాని బావ సూనుని మామన్
సతతము తల ధరియించిన
సుతవాహన వైరివైరి సున్నంబిదిగో!

పెద్దమ్మా!(జ్యేష్ఠ) సున్నం తే అని అడిగితే 'కుక్కా' సున్నమిదిగో అని సమాధానం చెప్పటం – ఈ రెండుపద్యాల సారాంశం. వీటికి పాఠాంతరాలు చాలా ఉన్నాయి. ఈ పదాలలో ఎటువంటి నూతన కల్పనా లేదు. పదాలు తెలియనివీ కావు. కాకపోతే పదాల అర్థాన్ని పేర్చుకుంటూపోయి అర్థజ్ఞానాన్ని పొందాలి. అందుకే క్లిష్టత.

వేదాలు తిరువేంగళాచార్యులుగారు క్లిష్టతకు నిర్వచనోత్తర రామాయణం నుండీ(తిక్కన) ఈ క్రింది పద్యాన్ని ఉదాహరించి యున్నారు.

చేసేతం బృథివీశు లందికొనఁ గాశీసింధుతోయంబులన్
జేసెన్ మజ్జన; మంగుటంబున హరించెన్ బల్లవోర్వీశు; ను
ల్లాసంబొందగ ఫాలలోచనము లీలంగట్టెఁ గావేరి; హే
లాసాధ్యాఖిల దిఙ్ముఖుండు కరికాలక్ష్మావిభుం డల్పుఁడే!

ఇది కరిరాలచోళుని గొప్పతనాన్ని వర్ణించే పద్యం. ఇక్కడ కరికాళచోళుని మూడు కృత్యాలూ వివరింపబడ్డాయి. ఒకటి – రాజులు తమంతతాము నీటిని అందుకొనగా, కావేరీ జలాలలో స్నానం చేయటం. ఇక్కడ 'అందుకొనఁగా' అంటే అందివ్వగా అన్నది అన్యప్రాంతాలలో వాడుక. ఫాలలోచనము లీలం కావేరిని కట్టడం మరో చేష్ట. 'ఉల్లాసంబందగ' అని క్రియా విశేషణం. ఉల్లాసం బందిన దెవరో తెలియటం లేదు. కాబట్టి కర్త్రాకాంక్ష అలాగే మిగిలిపోతుంది. బహుశః ఈ కారణాల వలన వేదాలవారు క్లిష్టతను భావించి యుండవచ్చు.

అయితే పదాలన్నీ పరిచితాలే అయినా ఇప్పటికీ అన్వయం పొసగకుండా అలాగే నిలిచియున్న తిక్కన పద్యం మరొకటుంది–

తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్మడవియందున్ బేరు వంచించియున్
బదు మూఁడేఁడులు నీవునుం దిరిగిరాఁ బాలీకపోవచ్చునే
యదిగాదేఁగెఁ బంటవై యుఖుము మాయల్ పన్ని నేర్పింపఁ జె
ల్లదు సూ నీకని యా సుయోధనుని యుల్లం బిచ్చి పోనాడుమీ

(ఉద్యోగపర్వం – 3/97)

ఇది ధర్మరాజు సుయోధనునితో చెప్పమని శ్రీకృష్ణునకు చెప్పిన పద్యం. యథాతథంగా ఇది పరమక్లిష్టతకు లోనయి ఉంది. స్థూలంగా ధర్మరాజు అభిప్రాయం ఏమిటంటే – "అడవిలో పన్నెండు సంవత్సరాలు, అజ్ఞాతంగా ఒక సంవత్సరం గడిపి, తిరిగి వచ్చి, అర్ధభాగం తీసికో" అని చెప్పి, మేము అలా చేసి, తిరిగి వచ్చిన తరువాత మా భాగం మాకివ్వకుండా ఉండవచ్చునా? – ఇది పద్యంలోని పూర్వార్ధం వరకే. ఇంత భావాన్ని పద్యంలో ఇమడ్చగలగటం చాలా కష్టం. మహాకవులకు కూడానా అని అనుమానించవసరం లేదు. తిక్కన మహాకవి మాత్రమే కాదు. తెలుగు పదాలతో వీలైనంత మేర కవిత్వం వ్రాయటం ఇష్టపడేవాడు. ఆ ప్రయత్నమే శక్తివంచన లేకుండా ఈ పద్య నిర్మాణంలో చేశాడు. కానీ కుదరలేదు. ఒక వేళ కుదిరిన పద్యం మనకు దొరకలేదేమో?

ఈ దూరాన్వయ రూపమైన క్లిష్టత కొన్ని కృత్రిమ విలక్షణ సందర్భాలలోనే దోషమవుతుంది. ఇతరత్ర అది వాక్యాలంకారంగా భాసిస్తుంది. ఈ క్రింది పద్యాన్ని విశ్లేషించి చూద్దాం.

ఎవ్వని వాకిట నిభమదపంకంబు
    రాజభూషణరజోరాజి నడఁగు
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు
    నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
    మానిత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేదు వారాసుల
    కడపటికొండపైఁ గలయఁబ్రాకు
నతఁడు భూరిప్రతాపమహాప్రదీప
దూరవిఘటితగర్వాంధకారవైరి
వీరకోటీరమణిఘృణివేష్టితాంఘ్రి
తలుఁడు కేవల మర్త్యుఁడె ధర్మసుతుడు

(ఆంధ్రమహాభారతం–విరాటపర్వం 2/191)

ఈ పద్యంలో **'ఎవ్వని'** అని ప్రారంభమై తొలి పదానికి సమాధానం **'ధర్మసుతుఁడు'**

(మిగాతా 21వ పేజీలో)

ఈనెల అంశం: అమ్మా బైలెల్లినాదో

ఐనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

మందాక్రాంత

అమ్మా బైలెల్లె, విరిసిన సౌహార్ద భక్తానురక్తిన్
సమ్మానించంగఁ గదలుడి, యాషాఢ మాసమ్మునందున్
నెమ్మిన్ రక్షించి మనుజుల మన్నించ నాసక్తితో, బో
నమ్ముల్ నింపారఁగ వరలు చందమ్ము నర్పించ రారే

మహాస్రగ్ధర:

ధరలో నాషాఢమందున్ దయఁగనఁగ సదా తల్లి యేతెంచు తానై
వరముల్ గుప్పించి ప్రోచన్ వరలుచు జనులన్, వర్షసందోహశక్తిన్
విరియన్ రోగమ్ములెన్నో విడివడఁ గలఁతల్ ప్రేమతోఁ బాపు రీతిన్
మురిపెమ్మున్ దాల్చి, బోనమ్ము లొసఁగి కరముల్ మోడ్చి కీర్తించ రారే!

మత్త. గ్రామమందునఁ దల్లిఁ గాంచుడి రమ్యతాకృతి నొందుచున్
ప్రేమ మీరఁగ గ్రామ వాసుల క్షేమమెంచుచు వచ్చెరా
పాయకుండఁగఁ గాచునమ్మకు, భవ్యరీతినిఁ గొల్చుచున్
నేమనిష్ఠల, బోన మిచ్చుచు నెమ్మిఁ గోరుచు వేడరే!

తరువోజ

మరిడమ్మ యెల్లమ్మ మనసున్న తల్లి మాయమ్మ బయలెల్లె మనలదీవించ
గరిమగల జనని గౌరమ్మ గడప గడప బోనాలతోఁ గలశములఁ గొని
సరగున దయచేసి సంతస మొదవి సకల మన్ననలఁ గొసరి సమర్పించి
మురిసి పోదము రండు పొలుపుగఁ గొలచి పొంగి పోదము రండు బుధజనులార

వసంత తిలక

ఆషాఢ మాసమున నాశ్రయమొందు చుండన్
శోషింపఁ జేయనిలఁ జూచుచు వ్యాధులెన్నో
పోషించి రక్షఁగనఁ బొందుగ నమ్మ వచ్చెన్
ఘోషించి స్తోత్రమటు కూర్మిని బోనమిమ్మా!

డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్

ఉ. అమ్మల గన్న అమ్మ భువినందరి డెందములన్ వసించు పె
ద్దమ్మ నమస్సులందగ ముదమ్మున వచ్చెను కాళికాంబ! లో
కమ్మును రక్షసేయగ సకాలమునందు వరమ్ములిమ్ముగా
నిమ్మహి నీయగా జనుల హృత్కమలమ్ముల విందు సేయగన్

మ. జనులన్ గాంచి వరమ్ములీయగన నా చాముండి! సామాన్యులున్
కని మ్రొక్కంగన, నావహించియును సాకారంపు రూపమ్ములన్
వినతుల్ గైకొన వచ్చెనో? జనని! సంప్రీతిన్ మహోద్దామ గ
ర్జనలన్ సల్పుచు శక్తిరూపిణుల స్వచ్ఛమ్మైన రూపమ్ములన్

శా. ఆషాఢ ప్రతిరూపిణీ! జనని సౌహార్దంపురూపమ్మునా
దోషఘ్నుల్ కననెన్నలేరు! జనసందోహమ్ములన్ గాంచినన్

ఖండ-శర్కర

నిర్వహణ: శతావధాని డా. ఎం.వి. పట్వర్ధన్
శతావధాని చేపూరి శ్రీరామ్

కాషాయ ప్రభలన్ వినూత్నములునౌ క్రాంతుల్ విడంబించు నా
వేషమ్ముల్ గని నంత దుర్జనములన్ భీతాత్ములం జేయునో?

చ. జయమును, గూర్చ సజ్జనులు సత్ఫలముల్ గనునట్లు జేయ, ను
జ్జయినిని పూజలందు నగజాత, జగజ్జననిన్ గనన్ మహో
దయమున నుండి బారులుగ తత్పరతన్ గనుచుండి దీవనల్
నయమున స్వీకరించెదు జనమ్ముల లీలలు కాంచగానగున్

ఉ. వర్షములన్ ప్రసాదముగ వర్ధిల నిచ్చుచు ప్రాణికోటినిన్
హర్షము నొంద జేయుము మహా జననీ! భరతావనిన్ సదా
కర్షకులందరున్ ముదము గాంచెడు నట్టుల నెన్నరాదొ? ఆ
మర్షమె?ఎంచగా వలదొ మానితమైన జనమ్ము క్షేమముల్?

పి.యల్.నాగేశ్వరరావు, హైదరాబాదు

కం. ఆషాఢంబున నమ్మను
తోషంబు నలంకరించి తొట్టెల లోనన్
దోషంబించుక లేకయె
వేషంబున బోతురాజు వేడ్కగ గొల్చున్!!

తే.గీ. మట్టివాసన విడనట్టి మనుజులున్న
మా తెలంగాణ గడ్డపై మహిమ జూపి
తా మహంకాళిగను దల్లి తనరుచుండి
యొడిని జేర్చును బిడ్డల నొడిసిపట్టి!

తే.గీ. కోట గోల్కొండ బోనాలు కూర్మిఁ బెంచ
సింహ వాహిని బోనాలు శ్రేష్ఠమయ్యి
జంట నగరాల యింటింటి జాతరయ్యి
ప్రజలు సంతస మొందుచుఁ బరవశింత్రు!!

తే.గీ. పరమ నిష్టతో మడిగట్టి, భక్తితోడ
నింతి నైవేద్యపుంబోన మింటవండి
సపరివారముతోనేగి సన్నిధికిని
బోనమర్పించి వరములఁ బొందునిచట!!

తదుపరి అంశం

విఘ్నహరా

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది 15 సెప్టెంబరు 2026

తే.గీ. సంప్రదాయపు రీతిని జాతి కొలువ
గ్రామ దేవత రూపాన కదలి నేడు
కాళి తొలగింప వెతలను కచ్చితముగ
నట్టి మహనీయ శక్తికి నంజలింతు!!

గట్టెడి విశ్వంత్, హైదరాబాదు

కం. బోనాల పండుగిది గా
దే! నమ్మకముంచి గ్రామదేవతలకు ఇం
పౌనటు పూజలు సల్పెద
రీ నరలోకమ్ము గావుమీ యని భక్తిన్.

ఆ.వె. పొంగుబోనములను పోచమ్మ కెక్కించి
"పిల్ల జెల్ల నెల్ల సల్లగుంచు"
మంచు పల్లె జనులు ఆనందమున కల్లు
నారగింపు జేతురమల భక్తి.

సీ. ఘటముకుండలు నీకు ఘనమైన బోనాల
నిదె తెచ్చినాము రావేమి నీవు.?
బెల్లపు సాకలు కల్లు సాకలు నీకి
వే పోయుచుండ రావేమి నీవు.?
నాగుపాముల బట్టి నడికట్లు గట్టి బై
లెల్లి ఎల్లమ్మ రావేమి నీవు.?
మావురానున్నవో మావూరి నున్నవో
ఎల్లమ్మ తల్లి రావేమి నీవు.?
తే.గీ. అనుచు భక్తులందరు వేడుకొనుచు నుండ
చల్లనైనట్టి నీచూపు ఎల్ల నరుల
పైన గురిపించు తల్లి, నీవైన పాద
ములకు పదివేల దండాలు తెలుపుకొందు.

ఆ.వె. పోతరాజులాట, బోనమెత్తినవారి
ఆట కనుల పండువగుచు నుండ
పులకరించి తనువు, పొంగిపోవు మనసు
భక్తిపరవశాన భవ్యరీతి.

పద్యపరీమళం

సమాజ సేవ - ఆధ్యాత్మిక సాధన

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.

ఆధ్యాత్మిక సాధన సాగించాలనీ సత్ఫలితం పొందాలనీ కొందరు అనుకుంటూ ఉంటారు. అది చాల సముదాత్తమైన ఆలోచన. తప్పేమీ కాదు.

కాని సమాజాన్ని సాటివారినీ పట్టించుకోకుండా వారి కష్ట సుఖాలతో సంబంధం లేకుండా తపస్సు పేరుతో ఎక్కడో అడవుల్లో కాలం గడపటం సమంజసమా?

సమాజం సుఖ శాంతులతో సుభిక్షంగా ఉన్నప్పుడు మానవుడు తన దారి తాను చూసుకుంటూ స్వర్గ సుఖాల కోసమో మోక్షం కోసమో ప్రయత్నించటం ధర్మమే?

కానీ సమాజం సమస్యలతో సతమత మవుతున్నప్పుడు, ప్రజలకు శాంతి భద్రతలు కరువై విపరీత విపత్కర పరిస్థితులు చుట్టు ముట్టినప్పుడు ఆధ్యాత్మిక సాధన పేరుతో సమాజాన్ని నిర్లక్ష్యం చేయటం ఎంత మాత్రమూ న్యాయం కాదుకదా!

- ఇది విద్యారణ్య స్వామి అంతర్మథనం. హైందవ ధర్మ రక్షణకోసం బాధ్యత పడిన విద్యారణ్య స్వామి తన తపస్సును తాత్కాలికంగా విరమించి, ఆ తపఃఫలాన్ని వెచ్చించి విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూనుకున్న ఉదంతాన్ని వివరిస్తూ ఆధునిక కవి శ్రీ కొడాలి సుబ్బారావుగారు చెప్పిన మాట ఇది. "హంపీ క్షేత్రం" కావ్యంలో కొడాలివారు చేసిన కవితాత్మక వ్యాఖ్య ఇది.

"లోకము భద్రమై సుఖ విలోకనమై పొలుపొందు నాడు స్వ
ర్లోకమొ మోక్షమో గని వెలుంగుట ధర్మముగాని లోకమే
చీకటియై విపత్తులకు చిక్కిననాడు తపంబు మోక్షమున్
చేకొని ముక్కు మూసికొని చెట్టుల గుట్టల బట్ట ధర్మమే?"

(17వ పేజీ తరువాయి) **కావ్యదోషాలు**

అన్న చివరిపదం. కర్త్రాశంక అప్పటికి గానీ తీరదు. అయితే కలిగిన శంక నిశ్శేష్టంగా అక్కడ ఆగిపోక రెండవ పాదంలో మరల ఎవ్వని అనటంతో దృఢతరమవుతుంది. మూడు నాలుగు పాదాలతో అది దృఢతమమవుతుంది. కలిగిన విచికిత్స ఆగకపోగా ప్రవాహరూపమై సాగుతోంది. ఎత్తుగీతి దగ్గరకు వచ్చేసరికి అతడు అని సమాధానం చిక్కింది. కానీ వ్యాకరణం సరిపోయింది కానీ సాధకుని ఆంతర్యం తృప్తి పడలేదు. అతడు సర్వనామమే కానీ నామవాచకం కాదు. శంక తీరలేదు. అక్కడ ఒక్క క్షణం ఆపాడు పాఠకుణ్ణి. 'భూరిప్రతాప... తలుఁడు" అంటూ పెద్ద సమాసం వేసేశాడు. ఈ సమాసం గతంలో క్లిష్టతకు ఉదాహరణంగా చూపబడిన సమాసాల (పవనాశనేంద్ర.... .... రమణకుమార) వంటిది కాదు. ప్రతిపాదమూ ఎక్కడికక్కడే సమన్వయపడుతూ వేగంగా 'ధర్మసుతుని' దగ్గరకు పాఠకుణ్ణి కొనిపోయే సమాసం.

అందుకే కొన్ని అన్వయం దూరంగా ఉన్నట్లు కనిపించినా అవి క్లిష్టదోషాలు కావు. పదాలు పరస్పరమూ అన్వయపడటానికి వెంటనే సహకరించని సమస్తప్రయోగమైనా, వ్యస్తప్రయోగమైనా, పద బంధమైనా, వాక్యరూపమైనా క్లిష్టదోషాన్ని ఆదరించినట్లే.

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర

పొడిచిన నేజా వెంటనె
వడి బైకొని చౌకళించి వచ్చిన పులుల
న్మెడ వెడలించెను బెడిదపు
టడిదంబున నేల గప్పినట్టుగ నుండన్!

ఆ పగిది వ్రేసి యుడుగక
యేపున సింగిణికి నారి యెక్కించి, వడిం
గోపుల బెబ్బులులం గని
తూపులకు న్వాని నోళ్లు దొనలుగ జేసెన్!

పై రెండు కంద పద్యాలు – 16 వ శతాబ్దికి చెందిన పొన్నికంటి తెలగన కవి రచించగా, “యాయాతి చరిత్రము” పేరిట తెలుగు సాహిత్య రంగంలో పుట్టిన మొట్టమొదటి “అచ్చ తెనుగు” కావ్యంలోని ద్వితీయాశ్వాసం లోనివి. ఈ ఆశ్వాసం ప్రారంభంలోని 30 కి పైగా పద్యాలలో యెరుకులు, యయాతి మహారాజుతో కూడి చేసిన వివిధ రకాల జంతువుల వేటలను విపులంగా వర్ణించడం జరిగింది. ఈ పై రెండు వరుస పద్యాలలో వేటలో యయాతి రాజు ప్రావీణ్యాన్ని, వీరత్వాన్ని, ముఖ్యంగా.. ఏక కాలంలో ఆయన వివిధ ఆయుధాలను సమర్ధవంతంగా ప్రయోగించిన ప్రతిభను రసవత్తరంగా కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు తెలగన కవి. ఆ వివరాలను పరిశీలించే ముందు, ముందుగా ఈ పద్యాలలోని అచ్చ తెలుగు పద ప్రయోగాలను సమీక్షిద్దాం.

1) నేజా = ఈటె లెక బల్లెం; 2) వడిన్ = వేగంగా; 3) పైకొను = మీదికి దూకు; 4) చౌకళించు = నాలుగు కాళ్ళెత్తి ఎగురు; 5) వెడలించు = తొలగించు; 6) బెడిదపు = భయంకరమైన; 7) అడిదము = ఖడ్గము; 8) నేల గప్పినట్టు = నేల కనిపించని రీతిగా మొత్తం కప్పివేసినట్టుగా; 9) వ్రేయు = ఖండించు; 10) ఉడుగక = శ్రమించకుండా లేదా అలసిపోక; 11) ఏపున = అధికంగా; 12) సింగిణి = విల్లు; 13) కోపులు = కోపించినవి; 14) తూపులు = బాణాలు; 15) తొనలు = వస్తువులు లేదా పదార్థాలను తనలో పొదుగుకొనునవి; 16) తూపుల తొనలు = అమ్ముల పొదులు.

ఈ అచ్చ తెనుగు పదాల పరిజ్ఞానంతో పై పద్యద్వయి భావాన్ని ఇట్లా అవగతం చేసుకోవచ్చు.

తన ఈటెతో పొడవగానే, వెంటనే వేగంగా, నాలుగు కాళ్ళను పైకెత్తి పైకి దూకుతున్న పులుల మెడలన్నిటినీ తన భీతి గొలిపే ఖడ్గంతో .. నేల అన్నది ఏ మాత్రం కనిపించని రీతిగా పూర్తిగా పులుల తలలతో కప్పివేసే విధంగా, వాటి మెడలను ఖండిస్తూ ఉన్నాడు ఆ యయాతి మహారాజు. ఆ విధంగా అలసిపోకుండా ఖండిస్తూ ఉంటే, ఇంకా .. నోళ్ళు తెరచి కోపంతో పైకి దూకుతున్న మరికొన్ని పులులను చూచి, తన విల్లుకు నారి సంధించి, ఆ పులులు తెరచిన నోళ్ళలో అధికంగా బాణాలను నాటుతూ, ఆ పులుల నోళ్ళను – “అమ్ములపొదులా?” .. అనిపించేలా మార్చివేసాడు.

వీరాధివీరుడైన యయాతి ప్రభువుకు వేటలో కూడ, అటు బల్లెంతో పొడుస్తూ .. ఇటు ఖడ్గంతో ఖండిస్తూ, ఆ వెంటనే విల్లును ఎక్కుపెట్టి బాణాలను అధిక మొత్తంలో సంధిస్తూ ... ఇట్లా – ఏక కాలంలో బహువిధమైన ఆయుధాలను ప్రయోగిస్తూ, వందలాది పులులను సంహరించే ప్రావీణ్యాన్ని కలవానిగా చిత్రించడమే లక్ష్యంగా ఈ రెండు పద్యాలను రచించాడు తెలగన కవి. ఈ పద్యాలలో – నేల కూడ కనిపించనంత విస్తృతంగా మొత్తం కప్పివేసేలా పులుల తలలను ఖడ్గంతో నరుకుతూ; మరొక ప్రక్క ఆ వెంటనే, భీకరంగా నోళ్ళు తెరచి పైకి దూకుతున్న పులుల నోళ్ళను అమ్ముల పొదులుగా భ్రమింపజేసేలా బాణాలను అధికంగా ఆ నోళ్ళలో దింపినట్లుగా వర్ణిస్తూ .. నాయకుని బహుముఖీన శూరత్వాన్ని కళ్ళకు కట్టినట్లుగా దృశ్యమానం చేయడంలో – కవి అసాధారణమైన వర్ణనాత్మక కవన సృజన శక్తి సామర్థ్యాలు పఠితలకు ప్రస్ఫుటమౌతాయి.

(13వ పేజీ తరువాయి) **అవధాన వేదిక**

చి. నరసింహదేవర జయలక్ష్మి సంస్కృత అష్టావధానం

పాహిమాం పరమే దేవి
వధానే మోదదే రమే వ ॥

3. అన్నపూర్ణాంబికా యత్ర
తత్ర నాస్త్యన్నవాంఛనం ।
అన్నేన సహ గీర్వాణం
అన్నం దాస్యతి సా సదావ ॥

ఘంటావధానం: తాతపూడి రామకృష్ణశాస్త్రి
అప్రస్తుత ప్రసంగం: తన్త్రవహి శ్రీరామమూర్తి

(చిత్రం చివరి అట్టలోపలిపుటలో...)

పద్యపరిమళం

సమస్యాపూరణం అనే అంశం పద్యప్రేమికులను విశేషంగా ఆకర్షించే ఒక ప్రక్రియ. శంకరాభరణం వేదిక లో గత పన్నెండు పదమూడు సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వాహకులు పెద్దలు కవి పండితులు సమస్యా పృచ్ఛక చక్రవర్తి శ్రీ కంది శంకరయ్య గారు ప్రతీరోజూ ఒక సమస్యనివ్వడం దానికి స్పందన గా పద్యకవులు పూరణ పద్యాలు పెట్టడం వాటిని గుణదోష విమర్శతో శంకరయ్య గారు సరిదిద్దడం ఒక యజ్ఞంగా కొనసాగుతోంది.

అందులో వచ్చిన ఒక సమస్య దాని పూరణ చర్చిద్దాం.

వాఙ్మయమున నున్నదెల్ల వ్యర్థము సుమ్మీ

ఈ సమస్యకు వచ్చిన ఒక పూరణ పద్యం గమనిద్దాం

ఋఙ్ముక్తోద్ధృత నిరతా
సృఙ్మేదుర కదన భయ విశేషావహ దు
ర్దృఙ్మాత్ర ఘన విపత్కర
వాఙ్మయమున నున్నదెల్ల వ్యర్థము సుమ్మీ!

ఈ సమస్య భావ పరంగా ప్రాస పరంగా రెండు రకాలుగా క్లిష్టత కలిగి ఉంది. పద్య సమస్యలు ఎప్పుడూ అసంబద్ధంగానే ఉంటాయి. సమర్థవంతంగా ఆ అసంబద్ధతను తొలగిస్తూ అర్థవంతమైన పూరణ నందించడమే సమస్యాపూరణం. అవధానంలోనూ సమస్యాపూరణమే విశేషమైన అంశం.

ఐతే తో కూడిన దుష్కర ప్రాస ఉంది. సమస్యలో ఉన్న పదము వాఙ్మయము అనేది వాక్+మయము అనే సంధి కార్యంతో ఏర్పడింది, ఇలా ఆలోచిస్తే క్+మ తో కూడిన పదాలు కొంత సులభంగానే లభ్యమవుతాయి. అందుకే పై పద్యం పూరణ చేసిన కవి వరుసగా మూడు పాదాలలో

ఋక్+ముక్త=ఋఙ్ముక్త

సృక్+మేదుర = సృఙ్మేదుర

దృక్+మాత్ర = దృఙ్మాత్ర అనే విధంగా దుష్కరప్రాసలోని క్లిష్టతను తొలగిస్తూ కవి పద్యం అందించారు. ఇది కవి ప్రతిభను పాండిత్యాన్ని తెలియ జేస్తుంది. ఇంత గొప్ప పూరణ నిచ్చింది మరెవరో కాదు సమస్యను ఇచ్చిన పెద్దలు శ్రీ కంది శంకరయ్య గారే. వారి పాండిత్యానికి నమోవాకములు తెలుపుతూ ఈ పద్యం యొక్క భావం ఆలోచిద్దాం

ఋఙ్ముక్తోద్ధృతులు అంటే ఇతరులలోని మంచిని గుర్తించి వారిని ప్రశంసించలేని నిందాపరులు, అసహృదయులు. ఉద్ధృత = వాదవివాదాలు రెచ్చగొట్టేవారు,

అసృక్+మేదుర = రక్తముచే సాంద్రస్నిగ్ధమైన కదనభయ విశేషావహ = యుద్ధం వలె గగ్గోలు పెట్టించుటవలె,

దుర్దృక్+మాత్ర = చెడు చూపులు మాత్రమే కలిగిన వారి,

ఘనవిపత్కర = విశేషముగా ఆపదను కూర్చు అంటే పాఠకులకు అహితమును కలిగించు.

పద్యంలోని క్లిష్టమైన పదాల భావం తెలిసాక పూర్తి తాత్పర్యం ఇలా అర్థం చేసుకోవచ్చు

"రసజ్ఞత లోపించడం వల్ల ఇతరుల రచనలోని మంచిని గుర్తించలేక నిష్కారణంగా వాద వివాదాలకు పూనుకుని సాహిత్య రంగాన్ని రక్తసిక్తమైన భయావహ యుద్ధరంగం వలె పరస్పర బాధావహంగా పరిణమింపజేయు దురాలోచనాపరుల వాఙ్మయమంతయూ నిరర్థకం కదా" అన్నది తాత్పర్యం.

ఈ అద్భుతమైన టీకా తాత్పర్యం అందించింది పెద్దలు కవి పండితులు డాక్టర్ ఏల్చూరి మురళీధరరావు గారు.

ఆ వ్యాఖ్యనే నేను దాదాపుగా ఇవాళ ఉపయోగించుకున్నాను.

అద్భుతమైన పద్యం అందించిన శ్రీ కంది శంకరయ్య గారికి అద్భుతమైన తాత్పర్యం అందించిన బహుభాషా కోవిదులు డాక్టర్ ఏల్చూరి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు నమస్సులు అందజేస్తూ

- 'శతావధాని' చేపూరి శ్రీరామ్

మనవి

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

- సంపాదకులు

సంస్కృతం-సంస్కృతి 12

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృతసాహిత్యములో పూర్వకవులు అనేకానేక ప్రయోగాలు చేయడమే కాకుండా సామాజిక స్పృహ కలిగినవారు. కనుకనే లోకసామాన్యానికి ఉపయుక్తమైన అనేక సూక్తులు, వాటికి ఉపపత్తులు చూపించి మేలు చేసారు. అవి అధ్యయనము చేసినప్పుడు అవధానికి తన పూరణలలో ఈ లోకోపయుక్తమైన సూక్తులు సందర్భోచితముగా వాడుకోగలుగుతాడు. పైగా ఇలాంటి సూక్తులు కూడా చెప్పడం ద్వారా అర్థాంతరన్యాసాలంకార ప్రయోగమే కాకుండ పూరణ పద్యానికి ఒక గాంభీర్యం వస్తుంది. అంతే కాకుండా కొన్ని ప్రయోగాలలోని వ్యంగ్యం కూడా అందంగా ఉంటుంది. అవి అనుకరించకుండా, అనుసరిస్తే అవధానపద్యాల సొగసు పెరుగుతుంది కదా.

పూర్వకాలములో సంస్కృతాధ్యయనం ఈ పంచకావ్యాల పాఠముతో ప్రారంభమయ్యేవి. ప్రతి శ్లోకము, దాని పదక్రమము, పదవిశ్లేషణ, లింగ, విభక్తి ఇత్యాది రూపాలు, వ్యాకరణాంశాలు, విశేషాంశాలు ఇలా బోధన జరిగేది. ప్రకృతములో అంత లోతైన అధ్యయనం కుదరక పోయినా, కనీసం అర్థతాత్పర్యాలు, వీలైనచోట విశేషాంశాలు తెలుసుకుంటే, మొదటగా పదసంపద పెరుగుతుంది.

ఉత్తమకవిత్వము ప్రకృతిపరిశీలనముతోనే వస్తుంది అనడంలో సత్యం లేకపోలేదు. ప్రస్తుతము రాతి అరణ్యాలలో నివసించే వారికి నిజమైన ప్రకృతి శోభను అనుభవించే అవకాశమే లేదు దాదాపుగా. కావ్యానుశీలనముతో కొంతవరకు ఆ కొరత తీరవచ్చు.

కాళిదాసు ఒక ప్రయోగం మేఘసందేశములోనిది చూడండి – 'నీత్వా మాసాన్ కనకవలయ భ్రంశ రిక్త ప్రకోష్ఠః' అంటాడు. కొన్ని మాసాలు ప్రియురాలి విరహవేదన అనుభవించిన ఆ యక్షుడు ఎలా ఉన్నాడంటే చేతికున్న బంగారు కంకణము జారిపోయి శూన్యమైన ముంజేతిని కలవాడైయ్యాడు అని. అంటే చక్కగా అలంకారముగా ఉన్న కంకణము జారి పడిపోయినంతగా చిక్కిపోయాడన్నది తాత్పర్యం. ఎంత చక్కటి భావప్రకటన కదా. ఇలాంటివి సంస్కృత మహాకవుల కావ్యాలలో కోకొల్లలు. మరిన్ని తరువాత చూద్దాం.

అలాగే నీతులు గురించి నాలుగు మాటలు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలము గురించి ఒక కవి అన్నది 'కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు చ శకుంతలా తస్యాంచ చతుర్థాంకః తస్మిన్ శ్లోక చతుష్టయం' అని. నాటకమంటేనే రమ్యత్వశోభతో ఉంటుంది. అందులోనూ శాకుంతలం ఇంకా రమ్యమట. అందులో కూడా నాలుగవ అంకం విశేషమట. అందులో కూడా నాలుగు శ్లోకాలు మరింత విశేషమైనవి అతీవరమ్యమైనవి అంటాడు. ఇక్కడ ఒక తండ్రి కూతురుని అత్తవారింటికి పంపేటప్పుడు పడే ఆవేదన, అలాగే తండ్రి బిడ్డకి అత్తవారింట మెలగవలసిన పద్ధతులు ఇత్యాది అనేకం చెప్తాడు. ఇవన్నీ ఈ సమాజములో కూడా ఉపయుక్తమైనవే.

'పాతుం న ప్రథమం యవస్యతిజలా యుష్మాస్వపీ తేషయా..' అన్న శ్లోకములో మనిషికీ ప్రకృతికీ మధ్యన ఉండే అనుబంధాన్ని అద్భుతముగా ప్రకటించాడు కవి. ఆమెట మొక్కలకి నీళ్ళు పోయకుండా మంచినీళ్ళు కూడా త్రాగేది కాదుట, తనకి ఆ లతల చిగురుటాకులను అలంకరించు కోవటం ఎంత ప్రీతికరమైనది అయినా సరే తుంచేది కాదుట, తన చేతితో పెంచిన మొక్కకి పువ్వు పూస్తే పిల్లలు పుట్టినంత ఆనందించి మురిసిపోయేదిట. ప్రకృతిని ఎంత జాగ్రత్తగా కాపాడు కోవాలో, వాటిలోని జీవకళని ఎలా పరిరక్షించాలో చెప్పడం ఒక ఎత్తైతే, అంతటి సుకుమార మనస్తత్వము గల శకుంతల పెళ్ళి అయి అత్తవా రింటికి వెళుతోంది అని, తనకి వెళ్ళిరావడానికి అనుమతి ఇమ్మని కణ్వమహర్షి మొక్కలతో చెప్తున్నాడు ఇక్కడ. మొక్కలకు జీవం ఉంది అని జగదీశ్ చంద్రబోస్ చెప్పకముందే కాళిదాసు చెప్పేసాడు.

'యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్ట ముత్కంఠయా' అన్న శ్లోకములో తన కూతురును అత్తవారింటికి పంపుతున్నప్పుడు తండ్రికి ఎడబాటు వల్ల గొంతు గద్గదమై మాట పెగలని స్థితి. కళ్ళు అశ్రుపూర్ణాలై దృష్టికి ఏమీ కనబడటం లేదుట. అంటే మొత్తం తన ప్రపంచమంతా జడంగా, నిర్జీవంగా మారిపోయినదా అన్నట్లైనది. చిత్రమేమిటంటే కణ్వుడు కేవలం పెంచిన తండ్రి శకుంతలకు. పైగా ఆశ్రమవాసి, తాపసి. మమతానుగారాలకు అతీతముగా సత్యాన్వేషణలో ఉన్నవాడు. అయినా తనకే మనసంతా ఇంత కకావికలమైపోతే అసలు తల్లిదండ్రులకు ఇంకెంత బాధాకరమో అని ఆశ్చర్యపడతాడు కణ్వ మహర్షి. ఆత్మవత్ అన్యాన్ పశ్యేత్ అంటారు పెద్దలు. తన బాధని విశ్వములోని అందరి తండ్రులదిగా భావించగలిగాడు.

అలాగే 'అస్మాన్ సాధు విచింత్య సంయమధనాన్ ఉచ్చైః కులం చాత్మనః' అన్న మూడో శ్లోకాన్ని గమనించినట్లైతే, గొప్పింటికి పేద తండ్రి కూతురుని పంపినప్పుడు అల్లునితో అనునయముగా చెప్ప వలసిన మాటలు, ఎంతో ఆర్ద్రముగా సందేశాత్మకముగా వర్ణిస్తాడు కాళిదాసు. ఇవి ఈనాటికి నిత్యనూతన సూచనలే. సారెలు, కట్న కానుకలు ఇవ్వలేమయ్యా, ఏదో చిన్నవారము, అయితే మాకు ధనం లేదని కాదు, మాకున్న ధనం నీతినియమాలు. సత్ప్రవర్తనకి మించిన ధనం లేదయ్యా, కనుక అట్టి గుణసంపదతో నా బిడ్డని నీకిస్తున్నాను అంటాడు. నీతి నియమాలు సంపదగా ఈనాడు కూడా భావించాలి కదా. అయితే కేవలం అల్లునితోనే కాదు కూతురుకి కూడా చెప్తాడు. 'సుశ్రూషస్వ గురూన్ ప్రియసఖీ వృత్తిం సపత్నీజనే' పెద్దలకి సేవ చెయ్యి, సవతులతో స్నేహంగా ఉండు, భర్త కోపంలో ఒక మాట అన్నా రోషం తెచ్చుకోకుండా అతనితో సామరస్యంగా ఉండు, సేవకుల పట్ల దయకలిగి ఉండు, భోగ భాగ్యాలున్నాయి అన్న ఉద్వేగంతో గర్వం దరిచేరకుండా చూసుకో. ఇవి ఉత్తమ ఇల్లాలి లక్షణాలు అని అంటాడు.

ఏనాటి సమాజమైనా అత్యవసర నీతి బోధ, ధర్మవర్తన బోధించే ఆణిముత్యాలు ఏరుకోవలసిన బాధ్యత అవధానిదే కదా.

(13వ పేజీ తరువాయి)

అవధాన వేదిక

చి. వింజమూరి సంకీర్త్య శర్మ జూమ్ - యూట్యూబ్ అష్టావధానం

అష్టావధాని
బాలకవి చి. వింజమూరి సంకీర్త్య శర్మ
Hyderabad. 10వ అవధానము

ఆధ్వర్యము
కొల్లారపు ప్రకాశరావు శర్మ (USA)
వ్యవస్థాపకులు:
మంథనీ పద్యసాధన బృందములు
(Est. March 2017)
గ్రంథకర్త:
"కొల్లారపు పద్యరచనామృత బోధిని"

సంచాలకులు
నేమాని ప్రసాద్
Mumbai, India

కీర్తనలు
కొల్లారపు జలజా రాణి
Richmond, VA, USA

ఆత్మీయ అతిథి
సువర్ణ విజయలక్ష్మి
Montreal, Canada

ప్రత్యేక అతిథి
శ్రీమతి Dr. రంగి కమల
Hyderabad, India

బాలపృచ్ఛకులు (మంథనీ పద్యసాధన శిష్యగణము)

నిషిద్ధాక్షరి: "సాహిత్యకిరణ్"
మాస్టర్ వరుణ్ ఆదిత్య, USA
B.S. 1st YR

సమస్య: కుమారి సత్య
యశస్విని వేదుల, USA
7వ తరగతి

దత్తపది: కుమారి శ్రేష్ఠ
విష్ణుభొట్ల, USA
11వ తరగతి

వర్ణన: కుమారి ఇంద్రాక్షి
అయ్యల సోమయాజుల, USA
9వ తరగతి

న్యస్తాక్షరి: మాస్టర్ సుబ్రహ్మణ్య
జితామిత్ర వేదుల, USA
5వ తరగతి

ఆశువు: మాస్టర్ జస్విత్
బోరా, India
9వ తరగతి

చిత్రానికిపద్యం: మిస్టర్
వేదవ్యాస్ విష్ణుభొట్ల, India
MBA 1st Year

అప్రస్తుతప్రసంగం: కుమారి
సుబ్రమణ్య మిహిర వేదుల,
USA. B.S.1st Year

వ్యవహర్తలు

గెంటేల జగదీశ్చంద్ర కుమార్, Hyderabad, India; రంగి సత్యనారాయణ శాస్త్రి, Hyderabad, India;
పర్వతనేని శ్రీసత్య, Winfield, IL, USA; కొత్తూరు వెంకట్, Ashburn, VA, USA;
పి.ఎల్. నాగేశ్వర రావు, Hyderabad, India; కొల్లారపు జలజా రాణీ, Richmond, VA, USA

Scan & Watch

YouTube అవధానము వీడియో

Scan & Read

అవధానము

ప్రసంశ ఆశీర్వదనము, ము॥

పద్యాలు(30 pages)

Scan & Download

Free eBook

Free ఛందస్సు పాఠాలు

10వారాలు/10 పాఠాలు (Zoom)

Text WhatsApp 01-703-728-4757 or

Send E-mail

KollarapuBodhini@gmail.com

మంథనీ పద్యసాధన బృందముల ఆధ్వర్యవంలో

చి. వింజమూరి సంకీర్త్య శర్మ జూమ్ - యూట్యూబ్ అష్టావధానం

ఆంధ్రి కుటీరం, పల్లిపాలెం, ఆంధ్ర ప్రదేశ్ వేదికగా

నరసింహదేవర జయలక్ష్మి సంస్కృత అష్టావధానం

అవధాన విద్యా విజయతే తరామ్

నందామశరదశ్శతమ్

అవధాన పుష్కరిణి పద్యవిద్యాభిమానులందరి ఆశీస్సులతో మలి శరత్తులోకి ప్రవేశించబోతుంది. ఇంతవరకు ఆన్లైన్ పత్రికగా వెలువడిన ఒక సంవత్సరం సంచికల సమాహారంగా అవధాన పుష్కరిణి వార్షిక సంచికను ఒక మేలిమి గ్రంథంగా ప్రచురించనున్నాము. బహుశా ఇది 250 పేజీల పైచిలుకు గ్రంథంగా రావచ్చు. అవధానానికి సంబంధించిన అనేకవిషయాలపై విద్వద్వరేణ్యులైన కవిపండితులు స్వచ్ఛందంగా పుష్కరిణికి రచనలందించారు. వారి సౌజన్యానికి నమోవాకాలర్పిస్తున్నాము. కొందరు పాఠకులు ఆన్లైన్లో చదవలేక ప్రతిసంచికను ప్రింట్ తీసుకొని చదివి దాచుకుంటున్నారు. ఎందరో పత్రిక విషయసమగ్రంగా ఉందనీ చదివిదాచుకోదగినదనీ ప్రశంసిస్తున్నారు. భావితరాల అవధానులకు ఈ పత్రిక ఒక కరదీపిక కావాలన్నదే మా ఆకాంక్ష. అందుకే అవధాన విద్యా వికాస పరిషత్ పక్షాన వార్షికసంచికగా అవధాన పుష్కరిణిని గ్రంథరూపంగా తెచ్చే సాహసం చేస్తున్నాము. విజయదశమి సందర్భంగా గ్రంథావిష్కరణ జరిపించి అందించాలని యోచన. ఇందుకు మీ చేయూత అవసరం.

పుస్తకం వివరాలకు 9441039146 నంబరును వాట్సప్ ద్వారా సంప్రదించగలరు

- సంపాదకులు

Published by
Avadhana Vidya Vikasa Parishat
R.No. 691/2026
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146